GIRDHARI, RNI Regn.No.TELTEL/2021/80612, Date of Pub - 25th of every month
Date posting - 1st of every month at BPC-IV, Patrika Channel, HYD - 01
Postal Regn.No.HQ/SD/525/2024-2026; Licensed to Post without prepayment
WPP No.PMG/TS/HQR/SC-04/WPP/2024-2026








Edited, printed, published and owned by Swami Sundara Chaitanyananda, Printed at M/s Karshak Print Solutions Pvt. Ltd., Moula Ali, Hyd - 500 040.

IF UNDELIVERED PLEASE RETURN TO :
SUNDARA CHAITANYA ASHRAM
HYDERABAD - 500 043

గిరిధారి

జూన్ 2026



పూజ్య గురుదేవుల దివ్య సన్నిధిలో సుందర సత్సంగ శాఖలు

శాశ్వత చందా రూ.1200/- 10 సం॥ లకు








యజ్ఞ పోషకులు


శ్రీమతి జి.పద్మజ రెడ్డి
అమెరికా, రూ.2,00,000/-
రెండు లక్షల రూపాయలు


శ్రీమతి స్వాతి, శ్రీ రాజ్‌కిరణ్
హైదరాబాద్ రూ.1,01,116/-
లక్ష వెయ్యి నూట పదహారు


శ్రీమతి ఎ.భారతి, శ్రీ ఎ.రంగయ్య
హైదరాబాద్
రూ.1,15,000/-
లక్ష పదిహేను వేల రూపాయలు


శ్రీమతి ఎ.యశోద శర్మ
హైదరాబాద్
రూ.1,00,000/-
లక్ష రూపాయలు


సుందర సత్సంగ్, వైజాగ్
రూ.1,25,000/-
లక్ష ఇరవై ఐదు వేలు


సుందర సత్సంగ్, నిజామాబాద్
రూ.81,220/-
ఎనభై ఒక్క వేల రెండు వందల ఇరవై



సుందర సత్సంగ్
కరీంనగర్
రూ.68,348/-


సుందర సత్సంగ్
మహబూబ్‌నగర్
రూ.60,000/-


సుందర సత్సంగ్
కడప
రూ.51,000/-


సుందర సత్సంగ్
నెల్లూరు
రూ.50,020/-


చి॥ జాన్వీ సహస్ర
నెల్లూరు
రూ.50,000/-


శ్రీ ఎస్.పాండులింగం
హైదరాబాద్
రూ.50,000/-


శ్రీమతి డి.రాధ
శ్రీ డి.మల్లికార్జున శర్మ
హైదరాబాద్, రూ.49,000/-


సుందర సత్సంగ్
సంగారెడ్డి
రూ.49,000/-


సుందర సత్సంగ్
ఖమ్మం
రూ.43,172/-


సుందర సత్సంగ్
చిత్తూరు
రూ.40,000/-


ప్రార్థన





శ్లో॥ దేవి సురేశ్వరి భగవతి గంగే
త్రిభువనతారిణి తరల తరంగే ।
శంకర మౌళి విహారిణి విమలే
మమ మతి రాస్తాం తవ పద కమలే ॥

సమస్త దేవతలను పాలించునది, భగవతి, పరిశుద్ధమైన తల్లి, త్రిభువనములను దాటించునది, శుద్ధమైన తరంగాలతో శోభించునది, శంకరుని శిరము నందు విహరించునది, నిర్మలమైనది - అట్టి గంగమ్మ తల్లి చరణ కమలముల యందు నా మనస్సు చల్లగా, మెల్లగా ఉండు గాక!



గీతాధార

ఆధ్యాత్మిక మాసపత్రిక

సంపుటి : 41 సంచిక : 7

వ్యవస్థాపకులు :
శ్రీ స్వామి సుందర చైతన్యానంద

ఇందులో

సంపాదకులు : శ్రీ స్వామి సుందర చైతన్యానంద


జీవిత సభ్యత్వం - రూ. 1200 /-
(10 సంవత్సరములు)

డి.టి.పి. & కవర్ డిజైన్
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్

ప్రింటింగు : బైండింగు
కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్

వివరములకు : సుందర చైతన్యాశ్రమం,
దుండిగల్ రోడ్, హైదరాబాద్ - 500 043. ఫోన్:(08418)255777, 9100908777

Visit us at : www.sundarachaitanyam.com (*email : admin@sundarachaitanyam.org*)



ఆప్తవాక్యం

ప్రవర్తనలు - ప్రాధాన్యతలు



మనిషిలో ఏ విధమైన శ్రద్ధ ఉందో, దానికి అనుగుణం గానే అతని జీవన విధానం ఉంటుంది. అతడు మరో విధంగా ఉండాలి అనుకున్నా ఉండ లేడు. అలా ఉండాలి అంటే, అతని కృషి ఎంత గానో ఉండాలి. వ్యక్తిలో విచారం విరబూయాలి. ఆ విచారాన్ని అతనిలో కలిగించడమే గాక, దానిని సక్రమంగా నడిపే వ్యక్తి కూడా తోడు ఉండాలి. నిశ్చయం దృఢంగా ఉంటే వ్యక్తి స్వభావాన్ని దాటి పోగలడు. మనస్సు లోని ప్రాధాన్యత లను మార్పు చేసుకోగలడు. అలా కాక, ఒక వైపు ప్రాధాన్యతలను పూజిస్తూ, మరో వైపు ప్రవర్తనలో పరివర్తనను ఆశించడము గుఱ్ఱం ముందు బండిని ఉంచడమే అవుతుంది.

ప్రాధాన్యత లనేవి బ్రతుకులో ఎంతటి ప్రముఖ పాత్రను పోషిస్తాయో నేను స్వానుభవంలో చూశాను. నా నలభై సంవత్సరాల సేవా జీవనంలో లెక్కకు అందనంత మంది నన్ను కలిశారు. ఆధ్యాత్మికంగా ఉన్నతిని సాధించాలని నన్ను ఆశ్రయించారు. కొందరు పరివర్తన చెందారు. అంటే, తమ ప్రాధాన్యతలను ప్రక్కకు నెట్టి, దేనిని ఆశించి వచ్చారో దానిని సాధించుకొనే క్రమంలో నిమగ్న మయ్యారు అని అర్థం. అలాంటి వర్గం ఒకటి ఉంది.

ఇక రాకపోకల తిరునాళ్ళు అంటారా? ఆ జాతర మరొక వైపు నిరంతరం సాగుతూనే ఉంది. ఏ పక్షి ఎప్పుడు వాలుతుందో తెలియదు. ఏ గువ్వ ఎప్పుడు ఎగిరి పోతుందో అర్థం కాదు. అర్థం కాని వాటికి భాష్యం చెప్ప మంటే ఎవరి తరము? ఎవరు ఎలా ప్రవర్తించినా అలా ప్రవర్తించడము వెనుక వారి స్వభావ ముంది. మనస్తత్వ శాస్త్ర

కోణం నుండి విశ్లేషిస్తే, వాస్తవానికి ఎవరైనా, వారి వారి స్వభావం చేత కార్యరంగం లోకి బలవంతంగా నెట్ట బడుతూ ఉంటారే గాని, అలా నెట్టబడి కర్మ లాచరించే వారికి, ప్రవర్తించే వారికి వారు అలా ఎందుకు ప్రవర్తిస్తున్నారో కూడా అర్థం కాదు. అంటే, వారి అంతఃకరణములో నిగూఢంగా పెనవేసుకు పోయిన స్వభావము వారికే అర్థం కాదు అని అర్థం. ఎవరి స్వభావం వారికే తెలియ నపుడు, మరొకరికి తెలిసే అవకాశం ఉందా?

ఉపన్యాసాలు వింటారు. ప్రబోధకుడు కనుక ప్రతిభావంతు డైతే తాత్కాలికంగా ఆవేశంతో స్పందిస్తారు. రజోగుణాన్ని తోడు చేసుకొని పరివర్తన వైపుకు ప్రాకు లాడుతారు. మొత్తానికి ఏదో ప్రయత్నం చేస్తారు. ఇక్కడే ప్రాధాన్యతలు పడగలు విప్పుతాయి. అదే మనిషికి కాళరాత్రి. బ్రతుకులో చీకటి రాత్రి. అలాంటి విషమ పరిస్థితిలో అర్జునుడు కళ్ళెమును కృష్ణుని చేతిలో పెట్టినట్లు, తమ బుద్ధి అనే కళ్ళెమును ఆచార్యుని చేతిలో పెట్టాలి. ఆ తరువాత అతడు సూచించిన మార్గంలో చరించాలి. ఇలా ప్రవర్తించడము కూడా స్వభావం పైనే ఆధారపడి ఉంటుంది. స్వభావాలలో ప్రాధాన్యతలు ఎలా ఉన్నవో దానిని బట్టే జీవన శకటం పయనిస్తూ ఉంటుంది.

కొందరు నన్ను అడుగుతూ ఉంటారు. స్వామీ! పూర్వం మీ వద్ద అతడు ఉండే వాడు. ఆమె ఉండేది. ఇటీవల వాళ్ళు కనిపించడం లేదే అని. నాలో నేను నవ్వుకొనే కొన్ని విషయాలలో ఇదొకటి. ఏం చెప్పేది? శ్రద్ధాత్రయ విభాగ యోగాన్ని బోధించేదా? సాధ్య మేనా? వారి కేదో సమాధానం చెబుతా ననుకోండి. అది వేరే విషయం. కాని, ముఖ్యమైన విషయ మేమిటంటే నన్ను ప్రశ్నించిన ఈ వ్యక్తి మనస్సులో ప్రాధాన్యత దేని కుందో అర్థం చేసుకోండి. ఏదో జ్ఞానార్జన అంటూ వస్తారు. అది స్వభావంలో ఉండదు కనుక, సాత్త్విక శ్రద్ధ లేని కారణంగా, రాజసిక శ్రద్ధే నిండి ఉన్నందున, వారి మనస్సులో ప్రాధాన్యత లౌకిక విషయాలకు ఉంటుందే గాని, పారమార్థిక విషయానికి ఉండదు.

లేని వారు ఎందుకు లేకుండా పోయారో అడిగే వ్యక్తి తెలుసుకొని ఏమి సాధిస్తాడు? ఎవరెవరు లేరు, ఉన్న వారిలో ఎవరెవరు ఎలా ఉన్నారు? ఈ ఆలోచనల కన్నా, ఈ ప్రపంచంలో ఉన్న వారందరూ లేకుండా పోయేందుకే ఉన్నారు అనే తాత్త్విక ఆలోచన చేయ గలిగితే ఇలాంటి అప్రస్తుత ప్రసంగాలకు అవకాశం ఉండదు.

ఇదంతా ఎందుకు చెబుతున్నా నంటే, ప్రాధాన్యతలను పరిశీలించకుండా ప్రగతిని సాధించ లేము. సాత్త్విక శ్రద్ధ లేకుండా ఆధ్యాత్మిక ప్రగతి సాధ్యం కాదు. ఇది

స్వానుభవం నుండి చెబుతున్న మాట! ఈ విషయంలో నేను కాయను కాను, పిల్లకాయను కాను. పండి పోయిన వాణ్ణి. నా భవ రోగ చికిత్సాలయంలో ఇప్పటికి ఎందరు రోగుల్ని చూశానో!

ఏ వైద్యు డైనా అందరు రోగుల్ని బాగు చేయ లేడు. అన్ని రోగాలు నయం చేయ లేడు. రోగం నయం కావడ మనేది కేవలం వైద్యుడి మీద, ఔషధం మీద, చికిత్సా విధానం మీదనే ఆధారపడి ఉంది అనుకోవడం భావ్యం కాదు. వాస్తవం చెప్పాలంటే, రోగి మీదనే ఎక్కువ శాతం ఆధారపడి ఉంటుంది. కనుక, వైద్యుడు తన ధర్మాన్ని తాను నిర్వర్తించాలి. అంతే. ఒకవేళ, ఆయుష్షు కారిపోయి రోగి మరణిస్తే, వైద్యుడు మరొక రోగి వైపు దృష్టి సారించాలే గాని, మరణించిన రోగిని తలచుకొని విలపించ కూడదు. ఇవన్నీ జీవన సత్యాలు.

ఆపదలను తట్టుకోలేక ఆశ్రమాలను ఆశ్రయించే వాళ్ళు, ఆరోగ్యాలను పోగొట్టుకొని వచ్చే వాళ్ళు, బాధలను భరించ లేక అరుదెంచే వాళ్ళు, బిడ్డను పోగొట్టుకొని వచ్చే వాళ్ళు - ఇలాంటి ఆర్తులు కొంత కాలం ఆధ్యాత్మిక మార్గంలో ఊరేగుతారు. ఆశ్రమాలలో ఉక్కిరి బిక్కిరి అవుతూ ఉత్సాహాన్ని పారబోస్తూ కనిపిస్తారు.

కొంత కాలం ఉంటారు. బాధలు తీరుతాయి. భయాలు తొలగుతాయి. స్వభావాలు పల్లవిస్తాయి. ప్రాధాన్యతలు పూత పెడతాయి. పిందె పుడుతుంది. పిచ్చి రేగుతుంది. ఆ తరువాత పలాయనమే ప్రస్థానము.

నా విషయాని కొస్తే, ఎవరైనా ఇతరుల పలాయనాలను, ప్రస్థానాలను నాతో ప్రస్తావిస్తే నేను ప్రతివచనం ఒక్కటే చెబుతాను. తరువు అన్న తరువాత పక్షు లెన్నో వాలుతాయి. వచ్చేవి వస్తూ ఉంటాయి. పోయేవి పోతూ ఉంటాయి. ఈ రాకపోకల తిరునాళ్ళకు, తరువుకు ఏమి సంబంధం?

ఆశ్రయించిన వారికి నీడ నివ్వడానికే తరువు ఉంది. వాలిన పక్షుల్ని తోలకుండా పండ్లు పెట్టేందుకే చెట్టు ఉంది. పండ్లు తిని పక్షులు ఎగిరినా, రెట్ట లేసి గువ్వలు రివ్వు మన్నా చెట్టు పట్టించుకోదు. తరువే పట్టించుకో నపుడు, గురువు పట్టించు కుంటాడా? 'నేనూ తరువు లాగా తటస్థుణ్ణే' అని చెప్పడానికే గురువులు తరువుల క్రింద ఆసీనులై ఉంటారు (మూలం తరోః కేవల మాశ్రయన్తః).

ఇప్పుడు నేను చెప్పిన దంతా సాధకులకు అమృత తుల్యమైన సత్యం. సాధన పరమైన విషయం. కనుక ముందు మనస్సులో ప్రాధాన్యతలు ఎలా ఉన్నవో గుర్తించాలి.

ఆ తరువాత అవసర మైతే, పరివర్తన వైపు పయనించే ప్రయత్నం దృఢంగా చెయ్యాలి. అందుకే, కాస్త అనుభవాన్ని జోడించి మరీ చెప్ప వలసి వచ్చింది.

జీవితం బొమ్మలాట కాదు. నవ్వులాట అసలే కాదు. జీవితం అతి స్వల్పం, అనిత్యం; కాదా? అని ప్రశ్నించింది శాస్త్రం. *అనిత్యం ఖలు జీవితమ్ ?* ప్రపంచం మనకు స్థిర నివాసం కాదు. కరుణించే స్వభావం కాలానికి లేదు. అందుకే ఊరి నంటి పెట్టుకొనే వల్లకాడు ఉంటుంది. అందరూ చక్రం తిప్పాలని చిందు లేసే వారే గాని, జనన మరణ చక్రాన్ని ఆపాలని ప్రయత్నించే పుణ్యాత్ము లెందరు?

మనస్సులో ఏది ప్రధానంగా ఉండాలో మనకు తెలిసి రావాలి. ఏది అవసరమో అర్థం కావాలి. అది తెలియక పోతే, నేడు అవసరాలుగా అంతఃకరణలో ఉన్నవి రేపు బ్రతుకునే అంతం చేయవచ్చు.

జీవితంలో పురుషార్థ నిశ్చయం జరిగి, ప్రధాన మైంది ఏదో తెలిసి వస్తే స్వభావంలో మార్పు వస్తుంది. సాత్త్విక శ్రద్ధ విరాజిల్లు తుంది. ప్రవర్తనలో పరిపక్వత గోచరిస్తుంది.

వచ్చిన దెపుడో తెలియదు ఎవరికి
పోయే రోజుందని తెలియని దెవరికి?
దారాసుతులు ధనదాయాదులు
కలిసి రాలేని రోజు అది
మట్టిలో కాయము కలవాలి
తోడొచ్చే దేమిటో తెలియాలి
రామ రామ జయ రాజారామ్
రామ రామ జయ సీతారామ్

విలువలకు విలువ కట్టడం నేర్చుకోవాలి. అప్పుడే బ్రతుకులో వెతలు తొలగుతాయి. వెలుగులు నిండుతాయి. కాలాన్ని వాడు కోవాలి. అంతేగాని కాలంతో ఆడుకో కూడదు. వాడుక లోనే ఉంది వేడుక. బుద్ధి సాత్త్విక మైతే, శ్రద్ధ సాత్త్విక మవుతుంది. సాత్త్విక శ్రద్ధ సాత్త్విక కర్మల్ని ఆవిష్కరిస్తుంది. అదే జరిగితే, బ్రతుకులో ఇక్కట్లు తీరుతాయి. చీకట్లు తొలగుతాయి.

ॐ స్వామి సుందర చైతన్యానంద

జాగేల రాజీవనయనా

శ్రీమతి సి.పద్మ

పాట (చైతన్య గానం - 6)

పల్లవి : జాగేల రాజీవ నయన
నినుబాసి క్షణమైన
మనగలనా కరుణాభరణా ॥ జాగేల ॥

అనుపల్లవి : నీ భక్తుడై యుండి నీ సేవ నాకుండి
అండీ! అండీ! అని పరుల వెంట పరుగిడగలనా ॥ జాగేల ॥

చరణములు :



1. అడిగి పుచ్చుకొని అటుకుల దింటివి
అడగక అక్షయ సంపద లిస్తివి
అడగవు నన్ను అడగ నీయవు
అచ్యుతానంత! ఏమిటిదంతా? ॥ జాగేల ॥

2. ఇది నాదంటూ, అది కాదంటూ
పలికి పలికి మది పగిలింది
ఏదీ ఎవరిది కాదని తెలిసి
ఎద నీ వైపుకు మరలింది ॥ జాగేల ॥

3. తొలిప్రొద్దులో కదిలెను భక్తి
నడుమ ఎందుకో తరిగెను శక్తి
ఉన్నది నీవే మనసులోన
నిన్నే నమ్మిన వాడను కానా ॥ జాగేల ॥

మానవ కృషిలో సాధ్యపడనిది మాధవ కృపలో సిద్ధిస్తుంది అనేదే మన ప్రియ గురుదేవుల దివ్య బోధ. ఈ సత్యమే ఒకప్పుడు వారి పసి మనసులో భావనగా కదిలి, వారు పెరిగే కొలది జీవితంలో అనుభవంగా మారి, ఆపైన వారి బోధలలో జ్ఞానమై వెలిగింది. గురుదేవుల జీవితము, గురుదేవుల జ్ఞానము రెండు వేరు కాదు.

కరములతో మనం చేసేది కృషి. కన్నులలో పరమాత్మ కురిపించేది కృప. పరమాత్మ పద్మదళ నేత్రుడు, రాజీవ నయనుడు. ఆయనది జ్ఞాన దృష్టి. జ్ఞానంలో ఉండేదంతా ప్రేమే. ప్రేమలో నిండేదంతా దయే. అందుకే పరమాత్మది కేవలం దయా దృష్టి. ఆయన కన్నులలో కురిసేదంతా కృపా వృష్టి. కన్నులు కరములు కలిసి నప్పుడు జరిగేదే కార్య సిద్ధి.

బిడ్డ క్షణమైనా తల్లిని విడువలేనట్లు భక్తుడు భగవంతుడిని త్రుటి కాలమైనా మరువలేడు. తనను మరువలేని భక్తులను భగవంతుడు ఎప్పుడూ విడువడు. బిడ్డ నిస్సహాయత తల్లి మమతకు కారణమైనట్లు భక్తుడి అసహాయతే భగవంతుడి వాత్సల్యానికి

కారణమైంది. బిడ్డ ఆకలి తీర్చేది తల్లి. భక్తుడి ఆర్తిని బాపేది భగవంతుడు. అందుకే

జాగేల రాజీవ నయనా
నిను బాసి క్షణమైన మనగలనా కరుణా భరణా ॥

అని భగవంతుని వేడుకుంటున్నారు పూజ్య స్వామిజీ. బ్రోచే భగవంతుడిని జాగు చేయవలదని, ఎడబాసి ఉండలేని తనను కడతేర్చ మనే భక్తుడి ఆర్తిని ఈ వాక్యాలలో వ్యక్తం చేస్తున్నారు పూజ్య స్వామిజీ.

కారణరూపుడైన భగవంతుడు హృదయంలో కొలువుండగా భక్తుడి నుండి కదిలే వన్నీ భగవత్కార్యాలే. భగవత్కార్యాలకు కర్త భగవంతుడే కనుక భక్తుడెప్పుడూ అకర్తయే. అందుకే తను చేపట్టే భగవత్కార్యాలకు భక్తుడెన్నడు పరుల సహాయాన్ని అర్థించడు. సహకరించ మని ఎవరినీ ప్రాధేయపడడు. కార్యం సిద్ధించినా సిద్ధించకున్నా తను మాత్రం పొంగక, కృంగక, భారమంతా భగవంతుడిదే ననే దృఢ విశ్వాసంతో ముందుకు సాగుతాడు. కోటి తారకలు కలిసి వెలిగినా చంద్ర ప్రకాశాన్ని వృద్ధి చేయలేవు. పరుల వల్ల మహాత్ముల వైభవంలో ఎదుగుదల, తరుగుదల అనేవి ఉండవు. మహాత్ములు చేపట్టే యజ్ఞ కార్యాలలో సమిధలు కాగలిగిన వారే ధన్య జీవులు. తామొక్కరే విలక్షణంగా వెలగాలని కాకుండా వెన్నెలలో విలీనమయ్యే తారల వెలుగులా తమ ప్రత్యేకతలను మరచిపోయి జీవించువారే పవిత్రాత్ములు. అలా కాక, గోరంత సమర్పించి, దానినే కొండంతగా భ్రమించి, తమ వల్ల ఏదో జరిగిందని, తత్ఫలితంగా తమ కేదో జరగాలని ఊహించే కుసంస్కారులే ఈ ప్రపంచంలో దుఃఖ భాగులు. అహంకారం చోటు చేసుకున్న సత్కర్మలు సత్ఫలితాలను అందివ్వ లేవు.

భక్తుడి కార్యదీక్ష, అతనిలోని సేవా తత్పరత, అనుకూల వాతావరణాలు ప్రతికూల పరిస్థితుల మధ్య ఊగిసలాడవు. ఊపిరి మనిషికి ప్రాణం పోస్తే భగవత్సేవ భక్తుడిలో ఆరవ ప్రాణమై నిలుస్తుంది అనే సత్యానికి పూజ్య స్వామిజీ జీవితమే తార్కాణం. అందుకే,

నీ భక్తుడై యుండి నీ సేవ నాకుండి
అండీ! అండీ! అని పరుల వెంట పరుగిడగలనా? ॥

అంటూ, తమలోని వైభవమంతా పరమాత్మదే కాని పరులది కాదనే తమ జీవిత రహస్యాన్ని గంట మ్రోగించినట్లుగా వెలిబుచ్చుతున్నారు పూజ్య స్వామిజీ.

అడిగి పుచ్చుకొని అటుకుల దింటివి, అడగక అక్షయ సంపద లిస్తివి
అడగవు నన్ను అడగ నీయవు అచ్యుతానంత! ఏమిటిదంతా? ॥

ఇచ్చి పుచ్చుకోవడ మనేది ఇద్దరు ఉన్నప్పుడే సాధ్యం. అభ్యర్థనలు, అంగీకారాలు అద్వైతంలో అనూహ్యం. ఒకొక్కప్పుడు ఒంటరిగా ఆడుకుంటూ పిల్లలు తమలో తాము రమిస్తుంటారు. తల్లీ బిడ్డలుగా, భార్యా భర్తలుగా, గురు శిష్యులుగా, అధికారి సేవకులుగా - ఇలా విభిన్న పాత్రలు తామొక్కరే అభినయిస్తూ పిల్లలు తమలో తామే ఆనందాన్ని అనుభవిస్తుంటారు.

జ్ఞాని కూడా అంతే. ఉన్నదంతా తానే అని ఎరిగి అద్వైతానందంలో ఓలలాడే జ్ఞాని నైమిత్తిక సుఖాలకై బాహ్యంలో అర్రులు చాచడు. భక్తుడు, భగవంతుడు ఇద్దరు వేరు కాదు. అందుకే ఆనాడు కుచేలుని ఉద్ధరించిన శ్రీకృష్ణ పరమాత్మ ఈనాడు తనను విస్మరించుటకు గల కారణమేమి అని నేరారోపణలు చేస్తున్నారు గురుదేవులు. నిందలు, అభియోగాలు, కలహాలు, విరహాలు, వియోగాలు, సంయోగాలు భక్తుడికి భగవంతుడికి మధ్య నిత్యము సాగే కేళీ విలాసాలే. పూర్ణ భక్తులు మన పూజ్య గురుదేవులు. కుచేలుడు అటుకుల మూటను శ్రీకృష్ణ పరమాత్మ నుండి దాచాడు. పరమాత్మ అడిగి పుచ్చు కునేందుకు గురుదేవులు దాచుకున్న దేమిటి? పూజ్య స్వామిజీకి ఉన్నదల్లా ఒక్క శ్రీకృష్ణుడే. వారిలో ఉన్నదంతా ఆ శ్రీకృష్ణుడే.

ఇది నాదంటూ, అది కాదంటూ పలికి పలికి మది పగిలింది
ఏదీ ఎవరిది కాదని తెలిసి ఎద నీ వైపుకు మరలింది ॥

అహంకార మమకారాలతో, రాగద్వేషాలతో కొట్టు మిట్టాడే ప్రపంచంతో పసితనం లోనే విసిగి వేసారిన పూజ్య స్వామిజీ మనసు, శ్రీకృష్ణుని తన వానిగా వరించి తరించింది. ఈ మాయా ప్రపంచంలో ఏదీ ఎవరిది కాదని, ఉన్నదంతా తానే నని తెలిసి జ్ఞాన తేజంతో హృదయం వెల్లి విరిసింది.

బాలలకు రోదనమే బలమన్నట్లు భక్తుడికి భక్తే ఎనలేని శక్తి. తల్లి బిడ్డను ఎత్తుకొని పనులు చేసుకుంటూ ఉండినా, బిడ్డ మధ్య మధ్యలో తల్లి గడ్డం పట్టి తన వైపుకు త్రిప్పుకొని చిరునవ్వు నవ్వుతుంటాడు, తానున్నట్లు తల్లికి గుర్తు చేస్తుంటాడువ. ఒడిలోనే కూర్చొని ఉన్నా తల్లి తనను మరచిందేమో నని బిడ్డ సందేహం. భక్తుడిది కూడా బిడ్డ హృదయమే. అందుకే,

తొలి ప్రొద్దులో కదిలెను భక్తి నడుమ ఎందుకో తరిగెను శక్తి
ఉన్నది నీవే మనసులోన, నిన్నే నమ్మిన వాడను కానా! ॥

అంటూ ప్రేమకై పరమాత్మ యెదను పదే పదే తడుముతున్నారు పూజ్య స్వామిజీ. భక్తి, జ్ఞానము అవిభక్తమని, భగవంతుడు భక్తుడు ఏకమేనని వారి ఆదర్శ జీవనం ద్వారా మరల మరల మనకు ప్రబోధిస్తున్నారు.

మార్గగామిగా పార్థసారథి ముందు నిలువగా, ధనుర్ధారి యైన అర్జునుడు విజయుడై వెలిగాడు. ఇది భారతంలో నరనారాయణులు మనకు అందించిన జ్ఞానం. రామనామం నాలుకపై నాట్యమాడుతుండగా రామదూత సాగరాన్ని అవలీలగా లంఘించాడు. ఇది రామాయణం మనకు తెలిపిన నామ వైభవం. భక్తి జ్ఞానాలు జీవన శకటానికి రెండు చక్రాలు కాగా జీవిత గమ్యం ముక్తి ధామమేనని ఓర్పుతో నేర్పుతూ మనలను ముందుకు నడుపుతున్నారు కరుణామయులైన మన గురుదేవులు.

జై జై గురుదేవ!

శ్రీ ఆదిశంకరాచార్య స్వామి కృతం

దక్షిణామూర్తి స్తోత్రం

ధారావాహిని-3

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

2 వ శ్లోకము

బీజ స్యాన్తరి వాంకురో జగదిదం ప్రా జ్నిర్వికల్పం పునః
మాయాకల్పిత దేశకాల కలనా వైచిత్ర్య చిత్రీకృతమ్ ।
మాయా వీవ విజృంభయ త్యపి మహాయోగీవ యః స్వేచ్ఛయా
తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥

బీజస్య	= విత్తనము యొక్క	మాయావీ ఇవ	=మాయావి వలె
అంతః	= లోపల	అపి	=మరియు
అంకురః ఇవ	= అంకురము వలె	మహాయోగీ ఇవ	=గొప్ప యోగి వలె
ప్రాక్	= ముందు	యః	=ఎవడు
నిర్వికల్పం	= వికల్పము లేకుండా ఉండి	స్వేచ్ఛయా	= తన సంకల్పము చేత
పునః	= మరల	విజృంభయతి	= వ్యాపక మగుచున్నాడో
మాయా కల్పిత	= మాయచే కల్పింప బడిన	తస్మై	=అట్టి
దేశకాల కలనా	= దేశకాల ప్రభావము చేత	శ్రీగురుమూర్తయే	= శ్రీసద్గురుమూర్తి యైన
వైచిత్ర్య చిత్రీకృతం	= చిత్ర విచిత్రముగా తీర్చబడినది	శ్రీదక్షిణామూర్తయే	= శ్రీదక్షిణామూర్తికి
		ఇదం	= ఈ
		నమః	= నమస్కారము.

భావము

ఈ దృశ్యమాన జగత్తు బీజము నందు అంకురము వలె సృష్టికి పూర్వము ఉండింది. మళ్ళీ మాయ చేత కల్పించబడిన దేశకాలాదులలో చిత్ర విచిత్రంగా గోచరిస్తూ ఉంది. గారడి వాని వలె, గొప్ప యోగి వలె ఈ మాయా ప్రపంచమును ఎవడు సృజించెనో అట్టి గురుమూర్తి యైన దక్షిణామూర్తికి నమస్కారము.

సృష్టికి ముందు అద్వయమైన పరమాత్మే ఉండినది. సృష్టి రావడ మంటూ జరిగితే

పరమాత్మ నుండే రావాలి. అలా రావాలి అంటే, అది రాక పూర్వము పరమాత్మ యందే ఉండాలి. ఎలా ఉండింది? భవిష్యత్తులో రాబోయే చెట్టు బీజము నందు అంకురము వలె ఉండింది. అవ్యక్తంగా ఉండింది. అభేదంగా ఉండింది. అదే నిర్వికల్ప మంటే. బీజస్థాయిలో అంటే కారణ స్థాయిలో కాండ శాఖాదులు, పత్ర పుష్పాదులు గోచరించవు. అయినా అక్కడ ఉండి తీరాలి. లేకపోతే కార్య స్థాయిలో అంటే, వృక్ష స్థాయిలో కనిపించే అవకాశం లేదు. కనుక కారణ స్థాయిలో నిర్వికల్పంగా ఉండి కార్య స్థాయిలో సవికల్పంగా తెలిసింది. ఇదంతా మాయా కార్యము. మొదటి శ్లోకంలో ప్రస్తావించబడింది, రెండవ శ్లోకంలో స్పష్టమగు చున్నది అదే.

సృష్టి కార్యమైతే, సృష్టికి కారణ మేమిటి? ఏదైనప్పటికీ, ***యత్కార్యం జాయతే యస్మాత్ తస్మిన్ తత్ ప్రతితిష్ఠతి*** - దేని నుండి ఏ కార్యము ఉత్పన్న మైనదో, ఆ కార్యము నందు దాని కారణమే ఉంటుంది. కార్యము కారణమును అనుసరించే ఉంటుంది అనేది సర్వులకు అంగీకారమైన విషయము. ***కారణానుగతం కార్యం ఇతి సర్వేశ్చ సమ్మతమ్!***

ఏది సృష్టింపబడినా, ప్రధానంగా రెండు కారణాలు ఉండి తీరాలి. ఒకటి ఉపాదానము; అంటే అది ఏ వస్తువుతో తయారు చేయబడినదో అది. రెండవది నిమిత్త కారణము. అంటే తత్సంబంధమైన జ్ఞానమును కలిగియుండుట అనునది. కుండ సృష్టి అనుకోండి. కుండకు ప్రధాన కారణమైన మట్టి ఉపాదాన కారణమైతే, కుండ జ్ఞానము కలిగిన కులాలుడు నిమిత్త కారణంగా ఉన్నాడు.

మనలో ఏర్పడిన స్వప్నము సృష్టి అయితే, దానికి నిమిత్తము, ఉపాదానము మనమే. ఎందుకంటే, కలలో మరొకరు లేరు కనుక. అలాగే అద్వయమైన పరమాత్మ నుండి సృష్టి వచ్చినట్లైతే, పరమాత్మలో రెండవ వస్తువు లేనందున, పరమాత్మే సృష్టిగా మారి ఉండాలి. అంటే, పరిణామం చెంది ఉండాలి. ***ఇది పరిణామ వాదము.***

ఏది పరిణామం చెందినా, అది తన పూర్వ స్థితిని కోల్పోక తప్పదు. పాలు పెరుగు అయింది అంటే, అది తిరిగి పాలు కాలేదు. ఇదే పరిణామ మంటే. ***స్వస్వరూప పరిత్యాగేన రూపాంతరాపత్తిః పరిణామమ్!*** బ్రహ్మము అలా పరిణామం చెందితే, అది బ్రహ్మము కాకుండా పోతుంది. బ్రహ్మము సృష్టికి, కుండకు కులాలుని వలె నిమిత్త కారణము అనే వరకు ఏ ఆక్షేపము లేదు. కాని, ఉపాదానం దగ్గరే సమస్యంతా. అందుకనే సృష్టి మాయాకార్య మని ప్రథమ శ్లోకం లోనే వివరించడం జరిగింది.

పరిణామం చెందేది మాయ. నిత్యమైన బ్రహ్మము పరిణామం చెందదు. మాయ సత్యం కాదు. సత్యమైన బ్రహ్మముపై ఆధారపడి ఉంది. ఆధారపడింది కనుక మాయ మిథ్యా భూతము. బ్రహ్మము సత్య స్వరూపము.


బ్రహ్మము జ్ఞాన స్వరూపము కనుక సృష్టికి నిమిత్త కారణము. మాయా నిర్మితములైన దేశకాలాదులలో దృశ్యమాన జగత్తు గోచరించుట చేత సృష్టికి మాయ ఉపాదాన కారణము. కుండలో మట్టే ఉన్నట్లు, సృష్టింపబడిన వస్తువులో ఉపాదానమే ఉంటుంది కనుక సృష్టి మాయా స్వరూపము. మాయకు స్వతంత్ర మనుగడ లేనందున, బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉన్నందున సృష్టికి బ్రహ్మము అభిన్న నిమిత్త ఉపాదాన కారణంగా ఉన్నాడు. కానీ, మాయ లాగా బ్రహ్మము పరిణామం చెందేవాడు కానందున, తాను పరిణామీ ఉపాదానం కాదు. మరేమిటి? అదే వివర్త ఉపాదానము. అంటే, తన స్వరూపమును విడువకనే, రూపాంతరము చెందినట్లు తెలియుట. **స్వస్వరూప అపరిత్యాగేన రూపాంతరాపత్తిః** - తాను తాను గానే ఉంటూ, మరోలా గోచరించడం వివర్తము. త్రాడు త్రాడు రూపాన్ని విడువకనే సర్పముగా గోచరించినట్లు. ఇదే వివర్తము.

బ్రహ్మములో మాయను దూర్చలేము. చేర్చలేము. కాని, మాయ బ్రహ్మమును ఆశ్రయించుకొని ఉన్నందున బ్రహ్మాధీనంలో ఉంది. మాయ తన ఆశ్రయంలో ఉన్నందున పరమాత్మ మాయావీ.

మాయ ఒక గారడి. మాయను ప్రదర్శించేవాడు మాయావి. మాయ సత్యం కాదు. మాయావీ సత్యము. మాయావి మాయ చేయడానికి ప్రత్యేకంగా ఉపదానం అవసరం లేదు. కేవలం ఇచ్ఛామాత్రం చేత గారడిని సృష్టించ గలడు. ***స్వసంకల్ప మాత్రేణ, స్వేచ్ఛయా!*** అలాగే పరమేశ్వరుడు స్వేచ్ఛయా సంకల్ప మాత్రేణ సృష్టిని చేయగలడు. అందుచేత, మాయావీవ - మాయావి వలె, ఇవ అనవలసి వచ్చింది. మాయావి స్వలాభం కోసం మాయా కార్యాన్ని చేస్తాడు. భగవంతుడు అలా కాదు. లోక కళ్యాణార్థం భగవంతుడు సృష్టి కార్యాన్ని చేస్తాడు. (లోకహితాయ).


అలా మహాయోగీవ - గొప్ప యోగులైన విశ్వామిత్రాదులు సంకల్పమాత్రం చేత, స్వర్గాదుల్ని సృష్టించారు. అలాగే ఈ సృష్టి కార్యాన్ని పరమేశ్వరుడు మాయ ద్వారా నిర్వహిస్తాడు. కాకపోతే యోగులు అహంకారంతో చేస్తే, పరమేశ్వరుడు పరహితార్థం చేస్తాడు. అందుచేత యోగీ ఇవ, యోగి వలె అనవలసి వచ్చింది. అట్టి ఆది గురువైన దక్షిణామూర్తి గురుదేవునికి వందనములు.

(సశేషం)



తరించే ఉపాయం

స్వామి సుందర చైతన్యానంద



కొంతకాలం వాడితే వస్త్రం మలిన పడుతుంది. వస్త్రమే కాదు, ఏదైనా వాడుకలో వేడుకను కోల్పోతుంది. వస్త్రాలు, వస్తువులు పాత బడవచ్చు. వాస్తవాలు ఎప్పుడూ పాతబడవు. క్రొత్తగానే ఉంటాయి. కాలంలో కరిగిపోవు. కాలప్రవాహంలో కొట్టుకొని పోకుండా ఎదురీది నిలుస్తాయి. అందుచేతనే సత్యం నిత్యనూతనంగా ఉంటుంది.

సృష్టి మొదలైంది ఎప్పుడో? ఎప్పుడైనా కానివ్వండి. అప్పటి నుండి సూర్యు డున్నాడు. పాతబడలేదు. సూర్యోదయం ఎవరికైనా అందం గానే కనిపిస్తుంది. నదీ జలము ఎవరు దిగినా వారిని చల్లబరుస్తుంది. చిరుగాలి ఎవరికైనా హాయిని, ఆహ్లాదాన్ని పంచుతుంది. ఎందరు పీల్చినా, పీలుస్తున్నా, ఎంతగా పీలుస్తున్నా, అందరి ప్రాణాల్ని నిలిపే గాలి పాత బడలేదు. వాస్తవాలన్నీ అలాగే ఉంటాయి.

జ్ఞానం కూడా అలాంటిదే. ఎప్పుడూ నిర్మలంగా, నిత్యమై శోభిస్తూ ఉంటుంది. అర్థం చేసుకోవాలి అనే ఆసక్తి ఉండాలే గాని ఏదైనా మనిషికి సాధ్యమే. అర్థమయ్యే లాగ ఇతరులు బోధించవచ్చు. కాని, మనమే అర్థం చేసుకోవాలి. మనకు అర్థం గాని సత్యం మరొకరి దగ్గర ఉన్నంత మాత్రాన మనకు ఒరిగేదేమీ ఉండదు.

చూస్తూ చేయటం - చేస్తూ చూడటం

ఏమండీ! మీ బరువెంత? మీ రెంత బరువున్నారు? (అని అడిగితే),

నేను డెబ్బై కేజీలండి (అన్నాడు ఒకాయన).

సరే, పుట్టినప్పుడు?

ఆఁ మూడో, అయిదో ఉంటాను.

పుట్టినప్పుడు అలా ఉండి ఇప్పుడు డెబ్బై కేజీలు ఎలా అయ్యారు?

పెరిగితే అయ్యాను.

అదే ఎలా పెరిగారు?

తింటే పెరిగాను.

ఎవరు తింటే పెరిగారు?

అదేమిటండీ! ఎవరో తింటే నేనెలా పెరుగుతాను? నేను తింటేనే నేను పెరుగుతాను.

అవును. మనం పెరగాలి అంటే, మనమే తినాలి. మనం తింటేనే మనం పెరుగుతాము. గతంలో ఏమి తిన్నామో, ఏమేమి తిన్నామో, ఎంత తిన్నామో, ఎంత వంట పట్టించుకున్నామో అదే ఈనాటి మన దేహం.

అలాగే గతంలో ఏమి చేశామో, ఏమేమి చేశామో, ఏమేమి చూశామో, ఏమి అనుభవించామో, అనుభవం ద్వారా ఏమి అర్థం చేసుకున్నామో, అదే నేడు మన జీవితం.

ఈనాటి మన జీవితం గతం నుండి పుట్టింది అయితే రేపు రాబోయే భవిష్యత్తు ఈ రోజు నుండే పుడుతుంది. గతంలో చేసిందే నేడు చూస్తున్నాం. నేడు చేసేది భవిష్యత్తులో చూస్తాం. మరో విధంగా చెప్పాలంటే, భవిష్యత్తులో మనం చూడాలి అనుకున్న దానిని వర్తమానంలో చేయాలి. కర్తను ఫలంతో కలిపేది, ఫలం వద్ద నిలిపేది కర్మే.

జీవన కళ

ఇలా ఎందుకయ్యాను? అని ఆలోచిస్తూ కూర్చుంటే ఇలలోనే అల్లాడుతూ ఉంటాం. మరోలా ఎందుకు కాలేము? అని ఆలోచించి, తదనుగుణంగా జీవించటానికి ప్రయత్నిస్తే ఇలలోనే కళను చూడగలం. అదే జీవనకళ. జీవితంలో వెన్నెల.

వెన్నెల ఇలలోనే. కాని, ఎప్పుడో? నెలకొకసారి - నెల పొడిస్తే, నెలపొడుపు వస్తే. జీవనకళ అలాంటిది కాదు. ఇది నెలపొడుపు కాదు, నెల పొడవునా కొలుపు. బ్రతుకంతా క్షణం క్షణం వెన్నెలే.

పాట

ఇలలో విరబూసిన కళ నెల నెల వెన్నెల
వెలయించినావు నమ్మినందుకు అన్ని కళలలో నన్నిలా
నీ చరిత పాడుకోనా మనసార వేడుకోనా
నా శ్రమలు తీరిపోగా తొలి భ్రమలు పారిపోగా ॥ నీ చరిత ॥

భోగి మంట

జీవితంలో అపాయాలే నేడు ఉండవచ్చు. అవన్నీ మనమే కొనితెచ్చుకున్నాం. అపాయాలను అధిగమించే ఉపాయాలను కూడా మనమే తయారు చేసుకోవాలి.

ఇంట్లో దుమ్ము చేరుతుంది. ధూళి చేరుతుంది. దానిని శుభ్రం చేసుకోవాలి. ఎవరు చేయాలి? ఎవరో వచ్చి ఎందుకు చేస్తారు?

ఇల్లు మనది. మన వల్లే ధూళి చేరింది. మనమే శుభ్రం చేసుకోవాలి. ఇటీవలే మనం భోగిపండుగ చేసుకున్నాం. భోగిమంట వేసుకున్నాం. ఎవరి ఇంటి ముందు వాళ్ళే భోగిమంట వేసుకున్నారు.

భోగికి మంటే పండుగ. భోగాలు అనుభవించడం, రోగాల చిదుగులు పేర్చు కోవడం, చివరగా మంటను అనుభవించి లేచిపోవడం, ఇదే భోగిపండుగ. భోగికి పండుగ.

మంటకు దగ్గరైతే వేడిబాధ; ఉష్ణము. మంటకు దూరమైతే చలిబాధ; శీతం. శీతోష్ణాలు, సుఖదుఃఖాలు అన్నీ అనుభవాలే. భోగానుభవాలే. భోగికి అనుభవాలే. ఈ అనుభవాల్లో ఆనందం ఎక్కడుందో చెప్పండి? ఈ విషయాన్ని వ్యాసభగవానుడు అద్భుతంగా ప్రవచించాడు.

సుఖ దుఃఖాలు

కచ్చిత్సుఖే వర్తమానో దుఃఖస్య స్మర్తు మిచ్ఛతి
కచ్చి ద్దుఃఖే వర్తమానః సుఖస్య స్మర్తు మిచ్ఛతి ॥

సుఖాలను అనుభవిస్తూ ఒకడు దుఃఖాన్ని స్మరిస్తూ ఉన్నాడు. దుఃఖాలలో మునిగి మరొకడు సుఖాన్ని స్మరిస్తూ ఉన్నాడు.

పండుగ రోజు భార్యాపిల్లలతో కలిసి విందుభోజనం చేస్తూ, ప్రమాదంలో చనిపోయిన కుమారుని జ్ఞాపకం తెచ్చుకొని కొందరు ఏడుస్తూ ఉంటారు.

భర్త ప్రేమతో కొనిపెట్టిన నగను ధరించి ఒక వైపు మురిసిపోతూ, మరో వైపు రైలు ప్రయాణంలో పోగొట్టుకొనిన ఆభరణం జ్ఞాపకం రాగానే ఒకావిడ ముఖం చిన్నబోయి అదోలా అయిపోతుంది.

కొందరి లోని గొప్పతనాన్ని గుర్తించి ఎవరైనా పొగిడితే ఒక ప్రక్క ఆనందిస్తూనే మరో ప్రక్క ఎప్పుడో ఎవరో విమర్శించిన విషయాన్ని జ్ఞాపకం తెచ్చుకొని బాధపడుతూ ఉంటారు. ఇలాగే ఉంటాయి సుఖాలలో దుఃఖస్మృతులు.

ఇక దుఃఖాల విషయానికి కొస్తే, కొందరు రోగంతో బాధపడుతూ ఉంటారు. ఒక వైపు బాధతో మూలుగుతూ ఉంటారు. మరో వైపు రోగం నయం కాగానే అది తింటాం - ఇది తింటాం, ఆ ఊరికిపోతాం - ఈ సినిమాకి పోతాం అనుకొంటూ సుఖాన్ని స్మరిస్తూ ఉంటారు.

చలికి వణకుతూ బాధపడుతూ ఉంటారు. ఎండ లొస్తా యనుకొంటూ వేడెక్కి పోతూ ఉంటారు. ఎండల్లో కాలుతూ బాధపడుతూ ఉంటారు. వానలు రాకపోతాయా అని చల్లబడుతూ ఉంటారు.

ఈ బాధలు ఇలాగే ఉంటాయా? ఈ కష్టాలు ఇలాగే ఉంటాయా? ఈ కన్నీళ్ళు కారుతూనే ఉంటాయా? గతంలో ఎన్ని కష్టాలు రాలేదు. ఎన్ని కష్టాలు పోలేదు. ఈ కష్టాలూ పోతాయి. మళ్ళీ సుఖపడే రోజులు వస్తాయి. మంచిరోజులు వస్తాయి అని కష్టాల్లో సుఖాల్ని స్మరిస్తూ ఉంటారు.

అనిత్యాలు

మన సుఖాలు సుఖాలు కావు. ఇవి సుఖా లైతే దుఃఖాల్ని ఎందుకు జ్ఞాపకం చేస్తాయి? అలాగే ఈ దుఃఖాలు కూడా దుఃఖాలు కావు. ఇవి దుఃఖా లైతే సుఖాల్ని ఎందుకు గుర్తు చేస్తాయి? ఇవన్నీ భ్రమలు. భ్రాంతులు. అందుకనే, వీటిని అనిత్యాలు అన్నాడు గీతలో శ్రీకృష్ణ పరమాత్మ.

అర్జునా! ద్వంద్వాలన్నీ అనిత్యాలు. **ఆగమాపాయినః అనిత్యాః... ఆగమాపాయ శీలాః తస్మాత్ అనిత్యాః**, రాకపోకలు గలవి. కనుక అవి అనిత్యాలు.

సుఖమే ఉండాలి అనుకోవటం సరి కాదు. ఎప్పుడూ సుఖమే ఉండదు. ఉన్నప్పుడు కూడా సుఖాల ముసుగులో భయాలు దాగి ఉంటాయి. ఈ క్షణాన ఉన్న సుఖం రేపు ఉండబోదు అనే భావన రాగానే భయం పుడుతుంది.

కనుకనే, ఇష్టమైన వాళ్ళను మరొక రోజు ఉండిపొమ్మని కోరుతాం. సరే, ఉంటారే అనుకుందాం. దాని వల్ల ఏమవుతుంది? మరొక రోజైనా పోవలసిందే కదా!

చుట్టం రావచ్చు అని నీకు తెలుసు. వచ్చాడనుకోండి. తరువాత, చుట్టం వచ్చాడని నీకు తెలుసు. తరువాత, ఉన్నాడని తెలుసు. తరువాత, ఉండడని తెలుసు. తరువాత, వెళ్తాడని తెలుసు. ఇక బాధేముంది? ఎప్పుడు వెళ్తాడు? ఎలా వెళ్తాడు? అంటారా! ఇవన్నీ అసందర్భం. అర్థరహితం. ఉండేవాడైతే ఆలోచించాలి. వెళ్ళేవా డైనపుడు ఎలా వెళ్తే ఏముంది? ఎప్పుడు వెళ్తే ఏమైంది? ఇవీ పోయేవే అని తెలిస్తే, తరువాత ఉన్నా, పోయినా పెద్ద తేడా ఉండదు. ఇవే అనిత్యాలు.

మోక్షార్హత

అనిత్యాలు ఎవరి మనస్సును కలత పెట్టలేవో, క్రుంగదీయలేవో అట్టివాడు మోక్షానికి అర్హుడు. అనిత్యాలు ప్రగతికి అవరోధాలు కావచ్చు. అలాగని వాటిని తొలగించే ప్రయత్నం కన్నా అర్థం చేసుకో గలిగితే అవి ఉన్నా లేనట్లే ఉంటాయి. ఇలాంటి మనస్సును కలిగి యున్నవాడు మోక్షార్హు డవుతాడు.

యం హి న వ్యథయన్త్యేతే పురుషం పురుషర్షభ
సమదుఃఖ సుఖం ధీరం సోఽ మృతత్వాయ కల్పతే ॥

అనిత్యాలైన సుఖదుఃఖాలు ఎవరిని బాధింపవో, ఎవడు సుఖదుఃఖాల యందు సమభావము కలవాడై యున్నాడో అట్టివాడు మోక్షానికి అర్హు డగుచున్నాడు అన్నది భగవద్గీత. **(సః అమృతత్వాయ కల్పతే - సః అమృతత్వాయ మోక్షాయ సమర్థః భవతి)**

మోక్షం సిద్ధం - అపరోక్షం

మీకు నేను అర్థమయ్యేలా చెప్ప గలిగానా? మీకు నేను చెప్పింది క్షుణ్ణంగా అర్థమైందా? అర్థం కాకపోతే మరచిపోండి. తరువాత ఆలోచించే ప్రయత్నం చెయ్యకండి. అర్థమైతే ఇప్పుడే కావాలి. లేకపోతే, తరువాత అయ్యే ప్రసక్తే లేదు.

ఏదైనా జోక్ వింటే వెంటనే మనం నవ్వుతాము. అలాగే ఉంటుంది విద్యాలాభం. జోక్ వెయ్యగానే నవ్వు రావాలి, అది జోక్ అయితే. అంతేగాని, నేను ఇప్పుడు జోక్ కట్ చేస్తే మీరు నవ్వేది రేపు కాదు.

నీళ్ళు త్రాగగానే దాహం తీరాలి. నిద్ర లేచి కళ్ళు తెరువగానే ఎదురుగా ఉన్న దృశ్యం కనిపించాలి. అలాగే శ్రవణం లోనే జ్ఞానం కలగాలి. గురువు బోధించే సమయంలోనే జ్ఞానం కలగాలి. **(ప్రబోధ సమయే)**. మనకు జ్ఞానం ఉన్నా శ్రోతకు కలగలేదు అంటే శ్రోత అర్హత లేనివాడై ఉండాలి.

సిద్ధమై ఉంది - మనం సిద్ధం కావాలి

జ్ఞానానికి శ్రోత సిద్ధపడాలి. రాగద్వేషాలను తటస్థపరచి, సుఖదుఃఖాలను దాటి జ్ఞానానికి సిద్ధపడాలి. జ్ఞానాన్ని చేజిక్కించుకొనేందుకు సిద్ధం కావాలి.

సోమరితనాన్ని దూరం చేసుకోవాలి. రాగద్వేషాలు సోకకుండా బుద్ధిని కాపాడు కోవాలి. సదా మనస్సు అనే పడకపై నామ కుసుమాలను, ధ్యాన మల్లెలను, పూజా పారిజాతాలను పరుస్తూ ఉండాలి. ఆ పూలపాన్పు పైకి జ్ఞానం వచ్చి చేరుతుంది. ఆదిశేషునిపై విష్ణుమూర్తి పవ్వళించినట్లు, పరమేశ్వరుడు హృదయంలో శయనిస్తాడు. ఆ తరువాత అంతా జ్ఞానమయం. ప్రజ్ఞానమయం.

చిద్విలాసుని చిరునామా

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేఽ ర్జున తిష్ఠతి ॥

ఈశ్వరుడు, పరమేశ్వరుడు, ఆదిశేషునిపై పవ్వళించిన నారాయణమూర్తి, సర్వ ప్రాణుల హృదయాలలోనే స్థిరంగా ఉన్నాడు అని పరమాత్మ చిరునామాను చిత్తానికి పట్టించింది భగవద్గీత. **(ఈశ్వరః ఈశన శీలః నారాయణః, సర్వభూతానాం సర్వ ప్రాణినాం, హృద్దేశే - హృదయదేశే తిష్ఠతి)**

ఇంకేముంది? అంతా తెలిసి పోయింది. పరమేశ్వరుడు హృదయం లోనే ఉన్నాడు. అయినా ఏమీ తెలియనట్లే ఉంది. ఎందుకో తెలుసా? శుద్ధబుద్ధి లేదు కనుక. కనుకనే, ఈ శ్లోకంలో అర్జునుని పార్థా! భారతా! ధనంజయ! అని పిలువకుండా, అర్జునా! అని సంబోధించాడు పరమాత్మ. అర్జునులైన వారికే, ఉన్న ఆత్మ ఉన్నట్లు తెలుస్తుంది అని దాని భావము.

అర్జునుల మైతేనే ఆత్మజ్ఞానం

అర్జున శబ్దానికి శుద్ధమైన బుద్ధి కలవాడు అని అర్థము. పరిశుద్ధమైన తెల్లని అంతః కరణము కలవాడు అని శ్రీ శంకరాచార్య స్వామి వ్యాఖ్యానించారు **(శుక్లాన్తరాత్మ స్వభావః విశుద్ధాంతః కరణః ఇతి)**. ఇందుకు వేదాన్ని కూడా సహకారంగా ఉటంకించారు.

అహశ్చ కృష్ణం అహ రర్జునంచ - అహః అంటే పగలు. **అహశ్చ కృష్ణం** అంటే ఒక పగలు కాంతిహీనంగా, కలుషంగా ఉందని అర్థం. అంటే నల్లని మేఘాలతో కప్పబడిన ఆకాశం గల పగలు అని భావం.

అహరర్జునం అంటే, ఒక పగలు స్వచ్ఛంగా, అంటే మేఘరహితంగా ఉండి, దివ్యంగా ప్రకాశిస్తూ ఉంది అని అర్థము. ఇదే శుద్ధబుద్ధి. అర్జునబుద్ధి.

మహారాజ పోషకులు



శ్రీ ఎన్.శ్రీనివాస రావు
హైదరాబాద్
రూ.40,580/-




శ్రీమతి బి.సరస్వతి
బెంగుళూరు
రూ.40,000/-



శ్రీ పి.కిషన్
నిర్మల్
రూ.39,448/-




శ్రీమతి కె.ఇ.జయ శ్రీదేవి
హైదరాబాద్
రూ.30,000/-



శ్రీ ఎస్.సూరిబాబు
శ్రీకాకుళం
రూ.30,500/-




శ్రీ ఎమ్.సుబ్రహ్మణ్యం
హైదరాబాద్
రూ.30,000/-



శ్రీ వై.వ్యాసరాజు
హైదరాబాద్
రూ.29,000/-



కుమారి సి.హెచ్.వి.ఎస్.సుబ్బలక్ష్మి
ఆశ్రమం
రూ.25,000/-




డా॥ శ్రీ సి.అనంత్
హైదరాబాద్
రూ.25,000/-



సుందర సత్సంగ్
కర్నూలు
రూ.20,232/-



శ్రీమతి కె.ఝాన్సీ
శ్రీ కె.వెంకటేశ్వర రావు
నెల్లూరు, రూ.25,000/-



శ్రీ వి.వి.ఎస్.సీతారామం
హైదరాబాద్
రూ.25,000/-




శ్రీమతి ఎ.నిర్మలా దేవి
హైదరాబాద్, రూ.24,000/-



శ్రీమతి వి.నాగమణి
వైజాగ్, రూ.25,000/-



శ్రీమతి ఎమ్.లక్ష్మి
ఆదిలాబాద్, రూ.22,000/-



శ్రీ యు.ఆగమయ్య
హైదరాబాద్
రూ.21,000/-

కోపంలో పడకు.... నిలబడు-2

స్వామి సుందర చైతన్యానంద



జీవితంలో సమస్యలు తప్పవు. మన జీవితంలో ఏర్పడే సమస్యలకు బాహ్య ప్రపంచము లేదా సమాజం కారణం కావచ్చు. కాని, అదే పూర్ణసత్యం కాదు. మన సమస్యలకు తెలిసో, తెలియకో మనం కూడా కారణం కావచ్చు. ఈ సమస్యల నుండి బయట పడాలి అంటే, ఈ రెండిటి విషయంలో మనకు నిగ్రహం ఉండాలి.

ప్రపంచం విషయంలో మనము నిగ్రహించడ మనేది ఉండదు. ప్రపంచంలో లేదా సమాజంలో మనం ఎవరిని నిగ్రహించగలం? ఇంతెందుకు? మన సంసారంలో మనం ఎవరిని నిగ్రహించగలం? మనం చెప్పినట్లు ఇతరులు నడుచుకోకపోతే, మనం ఏం చేయగలం? పెద్దవాళ్ళ మైతే కోప్పడగలం. చిన్నవాళ్ళ మైతే, పెద్దల కోపానికి గురై బాధ పడగలం. బాధపెట్టినా, లేదు బాధపడినా, ఇవి రెండూ సమస్యలుగా నిలిచేవే గాని, పరిష్కారాలుగా మిగిలేవి కావు.

వ్యక్తిలో కోపం ఉండొచ్చు. ఉంటుంది. ఒక వ్యక్తి లోని కోపానికి మరొకరు గురి కావాలా? అలా గురి చేయాలనుకొనే వ్యక్తి తనను తాను అలా పురిపెట్టుకోవాలా? ఒకరి కోపానికి మరొకరు ఎందుకు గురి కావాలి?

ఇంతవరకు ఏ తల్లి అయినా బిడ్డను కన్నదే గాని కోపిష్టిని కనలేదు. మరి బిడ్డ పెద్ద అయి కోపిష్టిగా మారడం ఎలా జరిగింది? కనడం వరకు బాగుంది గాని, బిడ్డను పెంచడం లోనే మన పాత్రను చక్కగా పోషించలేక పోతున్నాం. దానికి కారణం కూడా ఆలోచిస్తే బోధ పడుతుంది. మనమూ అలాగే చిన్న నాటి నుండి పెరిగాము కనుక, బిడ్డల్ని అంతకన్నా భిన్నంగా పెంచలేక పోతున్నాం. అలా కాకుండా మనం అవగాహనతో పరివర్తన చెందితే, బిడ్డల్ని చక్కగా తీర్చి దిద్దగలం. మనం బిడ్డల విషయంలో కోపాన్నే ప్రదర్శిస్తూ పోతే, దానిని అనుకరించి బిడ్డలు కూడా కోపిష్టులు గానే తయారవుతారు.

మన బిడ్డ చేసిన పని మనకు నచ్చక పోవచ్చు. బిడ్డ ప్రవర్తన మనకు కోపాన్ని కలిగించ వచ్చు. ప్రవర్తన అలాగే ఉండొచ్చు. ఆ ప్రవర్తన బిడ్డదే కదా! మనకు నచ్చే విధంగా, మనం మెచ్చే విధంగా బిడ్డ చేయగలడని ఆశించడం సముచితమా? పెద్దలే తెలిసీ తప్పులు చేస్తూ ఉంటారు. కాని, బిడ్డ చేసే తెలియని తప్పులకు బిడ్డను శిక్షార్హుణ్ణి చేయాలా?

(24వ పేజీ చూడుము)

మహారాజ పోషకులు



శ్రీ జి.మల్లేశం గుప్త
హైదరాబాద్
రూ.25,012/-

శ్రీ యు.వి.వి.ఎస్.ఎస్.ఎస్.రాజేశ్వర రావు
హైదరాబాద్
రూ.20,216/-

శ్రీమతి ఎస్.జయలక్ష్మి
వైజాగ్
రూ.20,022/-

శ్రీ కె.కృష్ణమూర్తి
హైదరాబాద్
రూ.20,227/-




శ్రీమతి డి.శకుంతల
సిరిసిల్ల
రూ.20,000/-

శ్రీమతి జి.రమ్య, శ్రీ జి.వెంకటేశ్
హైదరాబాద్
రూ.20,000/-

శ్రీ జి.విశ్వేశ్వర రావు
రాజమండ్రి
రూ.20,000/-

శ్రీమతి పి.హరిప్రియ
శ్రీ పి.హనుమాండ్లు
హైదరాబాద్, రూ.20,000/-



చి॥ జె.మురళీ మనోహర్
హైదరాబాద్
రూ.20,000/-

సుందర సత్సంగ్
బృందావన్ గార్డెన్స్
గుంటూరు, రూ.18,000/-

శ్రీ జి.విజయ్ కుమార్
హైదరాబాద్
రూ.17,000/-

శ్రీమతి కె.నవనీత
శ్రీ కె.మహేశ్
హైదరాబాద్, రూ.17,500/-



శ్రీ జె.బ్రహ్మం
గుమ్మడిదల, రూ.16,000/-

శ్రీ ఎస్.నాగప్రసాద్
హైదరాబాద్, రూ.15,500/-

శ్రీ పి.అచ్చయ్య
కర్నూలు, రూ.15,232/-

శ్రీ పి.ఎస్.లక్ష్మీకాంత రావు
మహబూబ్‌నగర్
రూ.15,116/-

రాజపోషకులు
రూ.5,000/-




శ్రీమతి సి.హెచ్.పద్మావతి
ఐర్లాండ్

శ్రీ ఎ.శ్రీహరి ప్రసాద్
నాగాయలంక

శ్రీ హరికృష్ణ
హైదరాబాద్

శ్రీ ఎమ్.వెంకట రెడ్డి
హైదరాబాద్

ఎమ్.శిరీష
అమెరికా



శ్రీమతి ఎమ్.కళావతి
వైజాగ్

చి॥ సి.హెచ్.రాధిక
హైదరాబాద్

శ్రీమతి ఎ.విజయలక్ష్మి
నిజామాబాద్

శ్రీ సి.హెచ్.దివాకర్
కరీంనగర్

శ్రీమతి ఇ.భాగ్యమ్మ
హైదరాబాద్



శ్రీ డి.ఉమర్
ఖమ్మం

శ్రీమతి జె.తార
కరీంనగర్

శ్రీ సి.హెచ్.యాదయ్య
హైదరాబాద్

శ్రీమతి కె.రాజేశ్వరి
చెన్నై

శ్రీమతి డి.వాసంతి
రాజమండ్రి



శ్రీమతి యు.స్వప్న
అమెరికా

కుమారి బి.హిమజ
హైదరాబాద్

శ్రీమతి సి.శారద
హైదరాబాద్

శ్రీమతి కమలా సత్యనారాయణ
హైదరాబాద్

శ్రీమతి బి.రమ
తొర్రూరు



శ్రీమతి పి.నిర్మల
సంగారెడ్డి

సుందర సత్సంగ్
తణుకు

శ్రీమతి బి.పద్మజ
హైదరాబాద్

కుమారి పి.వసుమతి
నిజామాబాద్

సుందర సత్సంగ్
వాఘాపూర్

(21వ పేజీ తరువాయి)

'ఇక మీదట ఇలా ప్రవర్తిస్తే నీ ముఖం చూడను. నీతో మాట్లాడను' అని బిడ్డపై కోప్పడటం సముచితమా? ఈ మాటలకు అర్థముందా? బిడ్డను చూడకుండా ఉండటం, బిడ్డతో మాట్లాడకుండా ఉండటం తల్లిదండ్రులకు సాధ్యమా? సాధ్యా సాధ్యాలను ప్రక్కన పెడితే, కోపం వచ్చినపుడు ఏదంటే అది అర్థరహితంగా మాట్లాడటం అలవాటై పోయింది. కోపిష్టికి తన అలవాటును రక్షించుకోవడం ప్రధాన మైందే గాని వారి కోపానికి గురౌతున్న వారిని పరిరక్షించుకోవా లనేది అర్థం కాకుండా పోయింది.

ఇలాంటి పరిస్థితులలో వచ్చే కోపాన్ని ఆపుకొని నిగ్రహంతో ప్రవర్తించడం అలవరచుకోవాలి. గద్దించకుండా, దబాయించకుండా, చెప్పదలచుకున్న దానిని ప్రియంగా చెబితే, ప్రేమ పలుకులతో చెబితే ఆ క్షణాన ఇల్లు స్వర్గంగా మారుతుంది. వాక్కు అగ్ని బీజం. వంటకు మంటలా ఉపకరిస్తుంది. అదే ఉగ్రరూపాన్ని దాల్చితే దగ్ధం చేస్తుంది. సక్రమంగా వినియోగించుకుంటే వాక్కు తపోరూపమై అమృతాన్ని పంచుతుంది. దారి తప్పి అక్రమంగా ఆలపిస్తే వాక్కు పతన హేతువై విషాన్ని విరజిమ్ముతుంది.

అగ్నికి రెండు లక్షణాలు ఉంటాయి. అగ్నిలో వేడి ఉంటుంది. అలాగే వెలుగూ ఉంటుంది. మన మాటల్లో, బాగా అర్థం చేసుకుంటే, ఎక్కువగా వేడి ఉంటుందే గాని వెలుగు ఉండదు. వేడి మాటల్ని లేకుండా చూసుకోవాలి. అప్పుడు కోపం నిగ్రహింప బడుతుంది. వెలుగు పలుకుల్ని ఆరబోయాలి. అప్పుడు శాంతి విరాజిల్లుతుంది.

మాటలు చల్లగా ఉండాలే గాని వేడిని పుట్టించ కూడదు. పంట పండినట్లు ఉండాలే గాని మంట పెట్టినట్లు ఉండకూడదు. వినే వారికి తృప్తిని కలిగించాలే గాని అసంతృప్తిని పంచకూడదు. శాంతిని కలిగించాలే గాని అశాంతిని పెంచకూడదు.

'నేను సత్యమే పలుకుతాను. ఇతరులకు కష్టం కలుగుతుందని నేను సత్యం మాట్లాడకుండా ఉండలేను' అని చాలా మంది అంటూ ఉంటారు. అలాంటి వారికి ఒక్క విషయం సుస్పష్టం కావాలి. సత్యమును పలికే మనం మన మాటల ద్వారా పరులను బాధించ గలమేమో గాని, సత్యానికి బాధించడం తెలియదు. సత్యము సుఖ పెట్టేదే గాని దుఃఖపెట్టేది కాదు.

మనం ఏమి మాట్లాడుతున్నాము అనేది ఎంత ప్రధానమో, ఎలా మాట్లాడు తున్నాము అనేది కూడా అంతే ప్రధానము. (1) మనం ఏమి మాట్లాడుతున్నాము? (2) ఎవరితో మాట్లాడుతున్నాము? (3) ఎక్కడ మాట్లాడుతున్నాము? (4) ఎప్పుడు మాట్లాడు తున్నాము? (5) ఎలా మాట్లాడుతున్నాము? - ఈ ఐదు విషయాలను మనస్సులో ఉంచుకొని మాట్లాడితే, కోపం మనకు ఎంతో దూరంగా పోతుంది. మాటలు వినసొంపుగా ఉంటాయి. మనస్సును కష్ట పెట్టకుండా ఉంటాయి. నీవు చెప్పేది వినే వాడికి అవసర మైనదే అనేది నీ అభిప్రాయమైతే, దానిని అతడు గ్రహించడానికి నువ్వు ప్రియంగా భాషించ వలసి ఉంటుంది. అప్పుడే అతడు స్వీకరిస్తాడు. ప్రశాంతతకు ప్రియాలు సహకరిస్తాయే గాని కోపాలు సహకరించవు.

రాజపోషకులు
రూ.5,000/-


శ్రీమతి వై.తిరుపతమ్మ
హైదరాబాద్



శ్రీ యు.రాఘవేంద్ర
హైదరాబాద్


శ్రీ జి.రామ్ కుమార్
హైదరాబాద్


శ్రీమతి పి.పారిజాతం
ఖమ్మం


సుందర సత్సంగ్
షోలాపూర్


శ్రీ ఎమ్.భూమేశ్వర్
నిర్మల్



శ్రీ బి.రమేశ్
సిద్దిపేట


సుందర సత్సంగ్
గుమ్మడిదల



శ్రీ వి.పి.ప్రసాద రావు
హైదరాబాద్


సుందర సత్సంగ్
గోదావరిఖని



సుందర సత్సంగ్
హనుమకొండ



శ్రీ పి.సత్యనారాయణ
ఖమ్మం


శ్రీ జగదీశ్వర్
మెట్‌పల్లి


శ్రీ కె.వి.రాఘవన్
హైదరాబాద్


శ్రీమతి బి.రేణుక
హైదరాబాద్


చి॥ కె.మాధవ చైతన్య
హైదరాబాద్


శ్రీ కె.శంకర రావు
హైదరాబాద్


శ్రీ ఎన్.నాగో రావు
ఆసిఫాబాద్


సుందర సత్సంగ్
లాల్పురం


శ్రీ జి.సుకుమార్
బెంగుళూరు


శ్రీమతి కె.నిర్మల
గుంటూరు


శ్రీమతి కె.మణికుమారి
గుంటూరు


శ్రీమతి ఎ.లక్ష్మి శాస్త్రి
వైజాగ్


సుందర సత్సంగ్
తణుకు


చి॥ కె.కృష్ణ కుమార్
హైదరాబాద్



శ్రీ శంకరాచార్య స్వామి కృతం

ధన్యాష్టకం

ధారావాహిని-3

వ్యాఖ్య
శ్రీ స్వామీజీ

3వ శ్లోకము

శ్లో॥ త్యక్త్వా గృహే రతి మధోగతి హేతుభూతాం
ఆత్మేచ్ఛ యోపనిష దర్థరసం పిబంతః
వీత స్పృహా విషయభోగపదే విరక్తా
ధన్యాశ్చరన్తి విజనేషు విరక్తసంగాః 3

త్యక్త్వా=విడిచి పెట్టి, గృహే=ఇంటిలో, రతిమ్=సుఖమును, అధోగతి=పతనం, హేతు భూతామ్= కారణం గలది, ఆత్మ ఇచ్ఛయా=ఆత్మాభిలాషతో, ఉపనిషత్=ఉపనిషత్తు లనెడి, అర్థరసమ్= జ్ఞానామృతమును, పిబన్తః=పానము చేయుదురు, వీత స్పృహాః=స్పృహ లేని వారై, విషయ భోగపదే=విషయభోగ స్థానముల యందు, విరక్తాః=విరక్తులై, ధన్యాః=ధన్యులు చరంతి= చరించెదరు, విజనేషు=నిర్జన ప్రదేశములో, విరక్త సంగాః=సంగత్వము విడిచిన వారై.

భావము :- పతన హేతువు లైన గృహ సుఖాలను త్యజించి, ఆత్మాభిలాషులై, సదా ఉపనిష త్పీయూషమును పానం చేస్తూ, విషయ స్పృహ లేని వారై, సంగత్వము లేని వారై, నిర్జన ప్రదేశములో చరించు విరాగులు ధన్యులు.

వ్యాఖ్య

పతన హేతువులు త్యాజ్యములు

తాను ఉన్నది ఎక్కడ? అని కాకుండా, తనలో ఉన్నది ఏమిటి? అనెడి విషయాన్ని దర్శించ గలిగిన వారు అభివృద్ధిని సాధిస్తారు. తనకు ఏమి ఉంది? అని కాకుండా, తాను ఎలా ఉన్నాడు? అని ఆలోచించుకొనే వ్యక్తి ప్రగతిని పొందుతాడు.

మనకు ఏవైనా ఉండొచ్చు. అవన్నీ మన మనస్సులో ఉండ నవసరం లేదు. ఉన్న వన్నీ మనస్సులో నింపుకుంటే అవి దూరమైన నాడు వాటిని మనస్సులో దూరం చేసుకోగలమా? భౌతికంగా దూరమై, భావంలో దూరం కానివి బుద్ధికి బరువవుతాయి. బ్రతుకుకు భార మవుతాయి.

ఉన్నవి ఏవైనా పోయేందుకే ఉన్నవి. ఉన్నంత వరకే వినియోగము. మితిమీరిన సాంగత్యాలు మిగిల్చేవి సంతాపాలే. ఉన్న వాటిని కుదించుకో నవసరం లేదు. వాటి విలువలను మదింపు వేసుకొని బ్రతకాలి.

గృహాన్ని త్యజింప నవసరం లేదు. గృహాసక్తిని త్యజించాలి. గృహ మంటే ఇల్లే కాదు; ఇంటి లోని వస్తువులు, వ్యక్తులు అన్నీ కలిసి గృహం. కేవలం ఇటుక, సున్నం, సిమెంటు, ఆకాశము ఇవే గృహము కాలేవు. ఇవన్నీ అవసరాలే. ఆసక్తి స్థానాలు కాకూడదు. ఈ ఆశలే ఒకనాడు మనో గగనంలో నిరాశా గాలుల్ని భయంకరంగా కదిలిస్తాయి. లేని విలువల్ని ఊహించటం అలవాటైతే ఉన్న కొద్దిపాటి శాంతి కూడా చేజారి పోతుంది. వాస్తవాన్ని మదింపు వేయ గలిగితే అవాస్తవాలు మనస్సు నుండి దూర మవుతాయి. రాగం తగ్గుతుంది. రాగం ఎంతగా తగ్గుతూ ఉంటుందో విరాగం అంతగా పెరుగుతూ ఉంటుంది. ఇదే వైరాగ్యం.

ఉన్న వాటిని త్యజించటం వైరాగ్యం కాదు. అవసరం కాని వాటిని మనస్సులో ప్రవేశించకుండా జాగ్రత్త వహించటం వైరాగ్యము.

గృహం బాధించదు; గృహాసక్తి బాధిస్తుంది. కాంత కలత పెట్టదు; కాంతాసక్తి కలత పెడుతుంది; ధనం కలవర పెట్టదు; ధనాసక్తి కలవర పెడుతుంది. ఏవైనా ఇలాగే ఉంటాయి. అవకాశం ఇస్తేనే అలజడులు. అర్థం చేసుకుంటే అన్నీ కదిలే అలలే. కరిగే కలలే.

ఈ విధమైన అవగాహన అవసరం లేని వాటిని బ్రతుకు నుండి తొలగిస్తుంది. అవసరాలను గుర్తిస్తుంది. ప్రగతికి సోపానాలను నిర్మించు కుంటుంది. పతన హేతువులను దూరం చేస్తుంది **(అధోగతి హేతుభూతమ్).**

ఆత్మేచ్ఛ అభిలషణీయం

అనిత్యాలపై ఆసక్తి సన్నగిల్లు తున్నది అంటే, నిత్యవస్తువు యొక్క అవసరం అవగతమైంది అని అర్థము. అవగాహన అభిలాషను పెంచుతుంది. అవసరం ఆసక్తిని వృద్ధి చేస్తుంది. ఆశించ దగింది సత్యాత్మ ఒక్కటే అని ధృవ పడుతుంది. ఇదే వివేకము. వివేకము అనేది అనుభవాలను పొందటం వల్ల కలిగేది కాదు; అనుభవాలను అర్థం చేసుకోవటం వల్ల మిగిలేది; దివ్యంగా వెలిగేది.

పానం చేస్తేనే దాహం తీరేది

దప్పిక ఏదో కాదు; దేహానికి నీటి అవసరాన్ని ఎరుక పరచే దీపిక. ఆత్మేచ్ఛ యనెడి దపిక కూడా అలాంటిదే. ఆత్మ సాక్షాత్కారం యొక్క ఆవశ్యకతను జీవికి స్ఫురింప చేసే ప్రదీపిక. పానం చేస్తే దప్పిక తీరుతుంది. ఆత్మజ్ఞాన జలాన్ని పానం చేస్తే ఆత్మేచ్ఛ అనెడి దప్పిక తీరుతుంది.

జీవులు జలాన్ని పానం చేస్తారు. దేవతలు అమృతాన్ని పానం చేస్తారు. మహాత్ములు జ్ఞానామృతాన్ని పానం చేస్తారు **(అర్థరసం పిబన్తః).**

జలాశయాల్లో జలం లభ్యం. స్వర్గంలో అమృతం ప్రాప్తం. ఉపనిషత్తులలో జ్ఞానం సిద్ధం. ఉపనిష త్సరోవరంలో సిద్ధమై యున్న ఆత్మజ్ఞాన జలాన్ని ఆత్మవిదులు పానం చేస్తారు. జ్ఞాన పిపాస గల వారికి విషయ పిపాస ఉండదు. ఉండలేదు. కనుకనే విషయ భోగాల యందు అనురక్తి లేని దివ్యాత్ములు విరక్తులు **(విషయ భోగ పదే వీత స్పృహాః విరక్తాః)**

ఎన్ని ఉన్నా మనిషి లేనివాడు గానే జీవిస్తున్నాడు. ఈ వెలితికి కారణం లేనివి కావు. ఉండి లేకుండా పోయే వాటిని, పోకుండా ఉండేవిగా భావించటమే వెలితికి కారణము. పోయే స్వభావాన్ని చూపుతూ ఉండేవి వెలితిని తొలగిస్తాయా? పోయే వాటితో కలిసి పోవటం, లేదా కలిసి ఉండటం రెండూ వ్యర్థమే. ఈ సత్యం బోధ పడితే ఇక కలిసినా తామరాకుపై నీటిబొట్టే **(విరక్త సంగాః)**.

నిత్యతృప్తుడు నిరాశ్రయుడే

సంగ రహితుడై, విషయ భోగ విరక్తుడై, ఉపనిష త్సరోవరము నందలి జ్ఞాన జలమును పానం చేసి తృప్తి చెందిన ఆత్మవిదుడు ఆత్మానంద సాగరంలో ఓలలాడు తున్నాడు. పూర్ణానంద రూపుడై ఉన్నాడు.

తన సుఖం మరొక దానిపై ఆధారపడి లేదు. తన లోనే తాను తృప్తి చెంది యున్నాడు. నిత్యతృప్తుడై ఉన్నాడు. తన తృప్తికి మరొకటి అవసరం లేనివాడు.

మనం తృప్తిని పొందటానికి ఏవేవో కావాలి. వ్యక్తులు కావాలి; విషయాలు కావాలి; అనుకూల పరిస్థితులు కావాలి. కాని ఆత్మజ్ఞాని యొక్క సంతృప్తి కేవలం తన స్వరూప విషయం. అందుకే అతడు హాయిగా అరణ్యంలో విహరిస్తున్నాడు **(చరన్తి విజనేషు)**.

అరణ్యంలో ఎవరూ ఉండరు; ఏదీ లభించదు. అయినా ఆనందరూపుడై చరిస్తున్నాడు. తన ఆనందానికి అన్యములు అవసరములు కావని తెలుపుటయే నిర్జన ప్రదేశమును సూచించుట లోని అంతర్భావము.

అరణ్యం భయ నిలయము. కాని, ఆత్మజ్ఞాని నిర్భయంగా విహరిస్తున్నాడు. అభయరూపుడై శోభిస్తున్నాడు. ఇది జ్ఞాని యొక్క అద్వైతానుభూతిని దర్శింప చేస్తూ ఉంది. ఇలాంటి ఆప్తకాములు ధన్యులు **(తే ధన్యాః)**. ఈ దివ్యానుభూతికి ప్రయత్నించు ముముక్షువులు కూడా ధన్యులే.

(సశేషం)



ఆశాకిరణం

పరమ పూజనీయులు, జ్ఞానరూపులు శ్రీశ్రీశ్రీ సుందర చైతన్యానంద స్వామి వారికి సాష్టాంగ నమస్కారములు.

జాతిని తీర్చిదిద్దువాడు ఉపాధ్యాయుడే అను భావమును కలిగించుటకై "దేశానికి ఉపాధ్యాయుడే ఆశాకిరణం" అను వ్యాసమును చిరు పుస్తకముగా ప్రచురించినాము.

దీని బహుళవ్యాప్తి కొరకు, వినియోగము కొరకు, తాము ఆశీర్వదించవలసినదిగా ప్రార్థించుచున్నాము.

భవదీయ విధేయుడు
మన్నవ గిరిధర రావు, ఎమ్.ఏ.

{ శ్రీ గిరిధర రావు గారు మాజీ శాసనమండలి సభ్యులు, పత్రికా సంపాదకులు. కళాశాలలో రాజనీతి శాస్త్ర శాఖాధిపతిగా పదవీ విరమణ చేశారు. 'దేశానికి ఉపాధ్యాయుడే ఆశాకిరణం' అనే వారి వ్యాసమును చూచి "ఇదొక అరుదైన, అందమైన వ్యాసం. విశేష ప్రాచుర్యానికి అనువైన వ్యాసం. 'గిరిధారి'లో ప్రచురించండి" అన్నారు పూజ్య గురుదేవులు. ఈ వ్యాసాన్ని పూర్తిగా ఈ సంచికలోనే ప్రచురిస్తున్నాం.

- సి. పద్మ, ఎమ్.ఏ., గిరిధారి కార్యాలయం }

దేశానికి ఉపాధ్యాయుడే ఆశాకిరణం

శ్రీ మన్నవ గిరిధర రావు, ఎమ్.ఏ.

దేశంలో దొంగలు పడ్డారనే మాట నిజమనిపిస్తున్నది. వాళ్ళు వట్టి దొంగలు కారు, గజదొంగలు!

గత అక్టోబరులో రాష్ట్ర శాసనసభలో అవినీతి, లంచగొండితనములపై జరిగిన చర్చలో "36 మంది ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. ఆఫీసర్లపై అవినీతి నిరోధక శాఖ వారు లంచగొండులుగా ఆరోపణలు చేశారనీ, వారిపై విచారణ జరపాలనీ" ఒక సభ్యుడన్నాడు.

పాకిస్తాన్ గూఢచారి సంస్థ అయిన ఐ.ఎస్.ఐ. తరపున గూఢచర్యం జరుపుతూ శత్రుదేశానికి మిలిటరీ రహస్యాలను అందజేస్తున్నారనే ఆరోపణ మీద ఐదుగురు రిటైర్డ్ ఆర్మీ ఆఫీసర్లు అరెస్టు చేయబడినట్లు సెప్టెంబరు 6న ఒక వార్త వచ్చింది.

"విద్యుత్ బోర్డులో ఒక మామూలు అసిస్టెంట్ ఇంజనీర్ లంచాలు తింటే అతని నెలసరి సంపాదన రెండు లక్షలు" అని లోక్‌సత్తా కన్వీనర్ ఒక వ్యాసంలో పేర్కొన్నారు.

దేశంలోని జాతీయ బ్యాంకుల నుండి పారిశ్రామికవేత్తలు తదితరులు ఋణాలు తీసుకొని ఎగవేసిన డబ్బు మొత్తం 60,847 కోట్ల రూపాయలకు చేరుకున్నదని ఒక వార్త,

ఇలా గుండెలు పగిలే వార్తలు ప్రతిదినం వస్తున్నాయి. మనము స్వతంత్రం పొందినది ఇందుకేనా? నేరాలు చేస్తున్న వారంతా ఉన్నత విద్యాభ్యాసం చేసినవారే కావడం ఆశ్చర్యకరం!

అక్రమాలను అరికట్టే మార్గం

జరుగుతున్న అక్రమాలను అరికట్టడానికి రెండు మార్గాలున్నాయి.

మొదటి మార్గం: ఆయా నేరస్థులను న్యాయస్థానాలలో విచారించి కఠినమైన శిక్షలు వేయాలి. శిక్షలు తీవ్రంగా ఉండాలి; విచారణ వేగంగా జరగాలి. ఒకరిద్దరిని ఉరి తీస్తే ఆ నేరం మరొకరు చేసేవారు కాదు. కనీసం పది సంవత్సరాల కఠిన కారాగార వాసమైనా విధించాలి. కాని మన దేశంలో న్యాయస్థానాలు శక్తిహీనంగా వున్నాయి. అవి గూడా అవినీతితో నిస్తేజంగా మిగిలిపోతున్నాయి.

ఇక రెండవ మార్గం: వ్యక్తి తనంతట తాను సన్మార్గంలో మెలగడం. పోలీసులు పట్టుకుంటారనో, న్యాయస్థానంలో శిక్షిస్తారనో గాక తన అంతరాత్మ చూస్తున్నదనే భావంతో నేరం చేయకుండా వుండడం. ఆంతరంగికంగానే మనిషిలో మార్పు రావాలి. అలాంటి మార్పు రావడానికి విద్యాబోధన కొంతవరకు ఉపకరిస్తుంది.

శ్రీ వావిలాల వారి స్వానుభవం :

ఆ మధ్య ఒక మారు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య గారితో మాట్లాడుతూ "మీరు వివాహం గూడా చేసుకోకుండా జీవితం యావత్తూ దేశసేవకోసం అంకితం చేశారు గదా, ఇలా చేయడానికి మీకు స్ఫూర్తి ఎలా లభించింది?" అని అడిగాను. అందుకు వారు "నేను ప్రాథమిక పాఠశాలలో చదువుచుండగా అద్దంకి ఆదినారాయణ శర్మ గారనే ఉపాధ్యాయుడుండేవాడు. ఆయన రోజూ మాకు దేశ పరిస్థితుల గురించీ, బ్రిటిష్ వారి దుశ్చర్యల గురించీ, దేశభక్తుల త్యాగాల గురించీ కొద్ది సేపు చెప్పేవారు. ఆయన చెప్పే సంగతులను విని, నేను ఉత్తేజితుడనైనాను. దేశసేవలో జీవితాన్ని గడపాలనే నిర్ణయానికి వచ్చాను" అన్నారు. ఒక ప్రాథమిక ఉపాధ్యాయుడు ఆ రోజుల్లో ఒక వావిలాలను తయారు చేశాడు. ఈనాడు ఎన్నో హైస్కూళ్ళు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలున్నాయి. వాటిలో నుండి మరొక వావిలాల తయారు కావడం లేదు. ఎందువలన? అందుకు కారణాలను పరిశీలించవలసి వున్నది.

అపసవ్యమైన దేశభక్తికీ, సవ్యమైన దేశభక్తికీ తేడా:

అపసవ్యమైన దేశభక్తి *(Negative patriotism)*

ఇంగ్లీషులో "శత్రువు మంచి బోధకుడు" ***(Enemy is a good teacher)*** అని సామెత ఉన్నది. శత్రువు ఒకడు ఉండడం వలన అతన్ని ఎదుర్కొనడానికి మనము బలము పెంపొందించుకోవాలనీ, నలుగురితో ఐకమత్యంతో మెలగాలనీ అనుకుంటాము. నిత్యజాగరూకులై వుంటాము.

అలాగే, స్వరాజ్యం రాకముందు ఆంగ్లేయులు మన శత్రువులు. ఒక లక్షమంది ఆంగ్లేయులు ఎప్పుడూ మన దేశంలో వివిధ ప్రభుత్వ శాఖల్లోను, సైన్యంలోను పనిచేసేవారు. రోజూ వాళ్ళను చూచినపుడల్లా యువకులకు రక్తం ఉడుకులెత్తేది. వీళ్ళను తరిమివేసి ఎప్పుడు స్వరాజ్యం సాధిద్దామా అని నిరంతరం ఆలోచించేవారు. ఆంగ్లేయులను ద్వేషించడమే ఆనాటి దేశభక్తి. ఎంత బాగా వాళ్ళను ద్వేషిస్తే, విమర్శిస్తే అంత గొప్ప దేశభక్తుడు. అందుచేత దాన్ని అపసవ్యమైన దేశభక్తి ***(Negative Patriotism)*** అనవచ్చు. అయితే దానివలన గూడ ప్రజలలో త్యాగభావమూ, కార్యదీక్షా ఏర్పడ్డాయి.

సవ్యమైన దేశభక్తి *(Positive Patriotism)*

1947లో ఆంగ్లేయులు వెళ్ళిపోయారు. కనుక శత్రువు ఉనికి వలన కలిగిన అపసవ్యమైన దేశభక్తికి అవకాశం లేకుండా పోయింది. అది ఒక్కసారిగా అంతరించింది. దానిస్థానంలో సవ్యమైన దేశభక్తిని ***(Positive Patriotism)*** ప్రజలలో కలిగించేటందుకు విద్య ద్వారా గాని ప్రచారం ద్వారా గాని ప్రయత్నం జరుగలేదు. అందుచేత ప్రజలలో అపసవ్యమైన దేశభక్తి అంతం కావడం వలన ఏర్పడిన ఖాళీలో "స్వార్థం" ప్రవేశించింది. స్వార్థం, పరిమితిలేని స్వార్థం ప్రజలను నడిపిస్తున్నది. **1947** తరువాత దేశంలో ఆర్థికాభివృద్ధికై ప్రణాళికలను అమలుపరచారు. భారీ పరిశ్రమలను స్థాపించారు. నదుల మీద ప్రాజెక్టులను నిర్మించారు. మంచిదే. కాని వీటిని సద్వినియోగపరచగల నిజాయితీపరులైన వ్యక్తులను తయారుచేసుకోలేదు. పరిమితిలేని స్వార్థమే వారిని నడిపిస్తున్నది. ఫలితంగా దేశం యావత్తూ కుంభకోణాల తోను, విదేశీ ఋణాలతోను నిండిపోయింది. వేల కోట్ల రూపాయలు వ్యక్తుల జేబుల్లోకి పోతున్నాయి. అడుగులేని సంచిలో ఎన్ని వేల కోట్లు పోసినా ఒక్క రూపాయి గూడ మిగలడం లేదు. ఈ దారుణ పరిస్థితిని అధిగమించాలంటే నిజాయితీ గల వ్యక్తుల నిర్మాణం అత్యవసరం.

విద్యాలయాల పాత్ర

దేశంలో శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు వున్నారు. వారు చట్టాలను తయారు చేయగలరే గాని వ్యక్తులను రూపొందించలేరు. సైనికులు, రక్షకభటు లున్నారే గాని వారు శాంతి భద్రతలను కాపాడగలరు గాని మనుష్యుల జీవితాలను మలచలేరు. పారిశ్రామికవేత్తలు వస్తు సామగ్రిని ఉత్పత్తి చేయగలరే గాని మనుష్యుల బుద్ధులను ఋజుమార్గంలో పెట్టలేరు. వ్యక్తుల నడవడిని సరిదిద్దగలవారు ఉపాధ్యాయులు మాత్రమే!

మానవుడు ఆలోచనలతో జీవిస్తాడు. అతనికి సరియైన ఆలోచనలిచ్చి ఉత్తమ జీవితాన్ని అందించేవాడు ఉపాధ్యాయుడే. "నాకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు ఋణపడ్డాను; అంతకంటె ఎక్కువగా ఆ జీవితాన్ని ఉత్తమంగా నడపడం ఎలాగో బోధించిన ఉపాధ్యాయునికి ఋణపడ్డాను" అన్నాడు అలెగ్జాండర్ చక్రవర్తి.

విద్యాబోధనలో మరొక చిత్రమున్నది. ఆస్థాన కవి యొక్క కుమారునికి గూడా విద్యాభ్యాసం అక్షరాలతోనే ప్రారంభించాలి. ఎందువల్ల? మరణమనేది ఒక తరాన్ని అంతం చేస్తుంది. మరొక తరం పుట్టుకొస్తుంది. ప్రతిరోజూ కొన్ని లక్షలమంది మరణించగా కొన్ని లక్షలమంది జన్మిస్తారు. అలా ఒక తరం పోయి మరొక తరం వచ్చినపుడు వారికి కావలసిన గుణ సంపదను నూతన తరానికి అలవరచే బృహత్తర కార్యం విద్యాలయాల ద్వారానే జరగాలి. కేవలం సిలబస్ పూర్తి చేయడమే ఉపాధ్యాయుని లక్ష్యం కారాదు.

"కేవలం కొంత సమాచారాన్ని బుర్రల్లోకి కుక్కితే అక్కడది గందరగోళం చేస్తూ జీర్ణం కాకుండా ఉండిపోయేది కాదు, విద్యంటే. మనిషిని సంస్కరించి శీలవంతుణ్ణి చేసి, జీవితాన్ని చైతన్యవంతం చేసే భావ పరంపరయే విద్య" అని స్వామి వివేకానంద అన్నారు.

గమ్యంలేని చదువులు

ఆ మధ్య ఒక వార్త వచ్చింది. ప్రకాశం జిల్లా కంభం సమీపంలోని ఘాట్ రోడ్ వద్ద ఇరువురు యువకులు దోవన వచ్చే లారీలను ఆపి దోచుకుంటున్నారట. పోలీసులు వెళ్ళి పట్టుకున్నారు. తీరా ఆ యువకులు సమీపంలోని డిగ్రీ కళాశాలలో బి.ఎస్.సి. విద్యార్థులని వెల్లడయింది.

1962లో చైనా మన దేశం మీద యుద్ధం చేస్తున్న రోజుల్లో బీజింగ్ రేడియో నుండి భారత వ్యతిరేక ప్రసారాలు హిందీలో వచ్చేవి. వాటిని చదివే కంఠం, ఉచ్చారణ భారతీయ మహిళవిగా ఉండేవి. ఆమెను గురించి భారత ప్రభుత్వం వాకబు చేయగా, ఆమె అస్సాంలోని తేజపూర్ హయ్యర్ సెకండరీ స్కూలులో 12వ తరగతి అత్యున్నత శ్రేణిలో ప్యాసయిన విద్యార్థిని అని తెలిసింది. డబ్బుకు ఆశపడి చైనా వెళ్ళి తన మాతృభూమికే వ్యతిరేకంగా ప్రసంగాలు చేయడానికి సిద్ధపడింది. మనం చెప్పే చదువులకు ఉన్నత లక్ష్యం లేదు. దారిదోపిడీలు చేయరాదని గాని, తన జన్మభూమికే ద్రోహం చేయగూడదని గాని అనిపించడంలేదు. స్వార్థం ఒకటే వారిని నడుపుచున్నది.

వ్యక్తిగత శీలము - జాతీయ శీలము

నేడు విద్యార్థులకు అలవరచవలసినవి వ్యక్తిగత శీలము, జాతీయ శీలము. వ్యక్తి తన స్వీయ జీవితంలో వ్యవహరించేటపుడు సత్యమునంటి పెట్టుకొని యుండడం, వ్యసనములకు లోనుగాకుండా వుండడం, తన కర్తవ్యాలను నెరవేర్చడం, నిరంతరం కార్యశీలిగా రూపొందడం వగైరా గుణముల నలవరచుకోవాలి. ఇదే వ్యక్తిగత శీలము.

ఇంతేగాక ఒక స్వతంత్ర దేశ పౌరుడుగా జాతీయ శీలాన్ని అలవరచుకోవాలి. అనేక సంవత్సరాలు విదేశీయ పాలనలో వుండడం వలన జాతీయ శీలం యొక్క ఆవశ్యకతను మరచిపోయాం. 'నేను' బాగుంటే చాలు, దేశము ప్రజలూ ఏమైనా ఫరవా లేదు; నా స్వీయ ఉన్నతి కొరకు ఏదైనా చేస్తాను - అనే భావం ఒకటే మనల్ని నడిపిస్తున్నది.

"నేను మాత్రమే కాదు; నా సమాజం బాగుండాలి, నా దేశం బాగుండాలి. అందుకు విరుద్ధమైన ప్రతి పనీ నిషిద్ధమే. అలాంటి దురాలోచన నాలో మొలకెత్తకుండా త్రుంచి వేస్తాను. ఇంకొకరిలో ఇట్టి ఆలోచన రానివ్వను" - ఇదే జాతీయ శీలము.

సవ్యమైన దేశభక్తి గూడ ఇదే. "స్వరాజ్యం వచ్చింది గదా. మనకింకా దేశభక్తి ఎందుక" నేవారు గూడా వున్నారు. సమిష్టి శ్రేయస్సు వ్యక్తి శ్రేయస్సు కంటె ప్రధానమైనదనే భావమే దేశభక్తి. దేశభక్తి అనగా ఈ భూభాగం మీద ప్రేమ; మరియు ఇచట ప్రజల మీద ప్రేమ; ఈ భూభాగంలో ప్రతి అంగుళమూ పవిత్రమైనదే. ఈ ప్రజలంతా నావాళ్ళు; నా వాళ్ళను నేను మోసం చెయ్యను; వాళ్ళను దోచుకొని నేను బ్రతకను. వారు ఎంత దరిద్రులైనా, అజ్ఞానులైనా, బలహీనులైనా వారిని నేను ప్రేమిస్తాను. ఇట్టి గాఢమైన చింతనయే దేశభక్తి. ఇది స్వతంత్రదేశంలో ప్రతి పౌరునికీ తప్పనిసరిగా ఉండవలసిన సద్గుణం.

ఉపాధ్యాయుడే ఆశాజ్యోతి

ఇలాంటి ఆలోచనలు రాబోవు తరానికి సమకూర్చే అవకాశం ఉపాధ్యాయునికి మాత్రమే ఉన్నది. మిగతా వృత్తుల వారెవరూ ఈ కార్యభారం వహించలేరు.

"నీతి బోధ లేకుండా విద్య గరపితే నీవు వారిని తెలివిగల దెయ్యాలుగా ***(clever devils)*** మాత్రమే తయారు చేస్తావు" అని డ్యూక్ ఆఫ్ వెల్లింగ్టన్ చెప్పాడు.

ఇపుడు దేశం ***clever devils*** తో లుకలుకలాడుతున్నది. గత **50** ఏళ్ళుగా విద్యాలయాల్లో నైతిక బోధనకు స్థానం కల్పించ నందువల్లనే పెద్ద పెద్ద డిగ్రీలు కలవారు కూడా ప్రభుత్వ ఖజానాకు కన్నంవేసి కోట్లకు కోట్లు దండుకొంటున్నారు. "పోయేటప్పుడు వెంటరాదుగా పూచికపుల్లయినా" అనే సత్యం గ్రహించలేకుండా ఉన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ కె.ఆర్. శ్రీనివాస అయ్యంగార్ అధ్యాపకుల నుద్దేశించి మాట్లాడుతూ ఇలా అన్నారు. "మీరు వారానికి ఆరు గంటలు చొప్పున సబ్జక్టులో పాఠం చెపుతారు. అందులో ఐదు గంటలు మాత్రమే పాఠం చెప్పి ఒక పీరియడ్‌లో విద్యార్థులను కుశల ప్రశ్నలు వేయండి. సమకాలీన విషయాలపై వారి అభిప్రాయాలకు మీ అభిప్రాయాలను జోడించండి. తుదకు జీవితానికి మార్గదర్శకంగా ఉండేటట్లు చరిత్రనుండి, మహాత్ముల జీవితాల నుండి, పెద్దల ప్రవచనాల నుండి కొన్ని విషయాలను వారి దృష్టికి తీసుకొని రండి" అని చెప్పారు.

నైతిక బోధన స్వరూపం

దీన్ని బోధించడానికి నిర్ణీతమైన పుస్తకాలేవీ లేవు. టైమ్ టేబుల్‌లో దీనికి ఎలాంటి ఏర్పాటు లేదు. హైస్కూళ్ళలో ఒకప్పుడు వారానికి ఒక పీరియడ్ దీని కొరకు ఉండేది. కాని ఇప్పుడది లేదు. లేకపోవడానికి కారణం నైతిక బోధనను మతబోధగా భావించుకొని

మనది సెక్యులర్ రాజ్యం గనుక, విద్యాలయాల్లో మతబోధ చేయరాదు గనుక నైతిక బోధ గూడా చేయరాదని ప్రభుత్వం భావించింది.

అసలు మతబోధ వేరు, నైతిక బోధ వేరు. దేశాన్ని ప్రేమించమనీ, వ్యసనాలకు లోనుకావద్దనీ, కార్యశూరుడవు కమ్మనీ చెప్పడం మతబోధ అవుతుందా? కాదు. ఒకవేళ మతానికి చెందిన ఒక మహనీయుని గురించి చెప్పినా దాన్ని నీతిబోధ కొరకే చెపుతాము గాని మతాన్ని బోధించడం కొరకు కాదు.

డా॥ సి.వి.రామన్ సంగతి

ఒకమారు డా॥ సి.వి.రామన్ బెంగుళూరులోని తన వైజ్ఞానిక పరిశోధనా కేంద్రంలో పనిచేయడానికి ఉన్నత విద్యార్హతలు గల విద్యార్థులు కావాలని పత్రికల్లో ప్రకటన జారీ చేశాడు.

అనేక చోట్ల నుండి అభ్యర్థులు వచ్చారు. వారందరినీ ఇంటర్వ్యూ చేసి ఉత్తములను ఎంపిక చేసుకొని మిగతావారిని పంపివేశాడు.

ఒక గంట గడిచిన తరువాత ఎంపిక కాని ఒక వ్యక్తి వరండాలో కనిపిస్తే అతన్ని జూచి రామన్ "నీవు వెళ్ళవచ్చునని ఇందాకే చెప్పాంగదా, ఇంకా ఇక్కడే తిరుగుతున్నావేం?" అని అడిగాడు.

అందుకతడు "మీ ఆఫీస్ వారు రాకపోకల చార్జీలు చెల్లిస్తూ కొంత డబ్బు ఎక్కువ ఇచ్చారు. దాన్ని తిరిగి ఇచ్చి పోతున్నాను" అని అన్నాడు.

అపుడు డా॥ రామన్ సంతోషంతో "అబ్బాయీ! నాకు కావలసింది నీలాంటి నిజాయితీపరులైన వ్యక్తులే. నీవు తిరిగి వెళ్ళనవసరం లేదు. ఇక్కడే ఉండిపో. నిన్ను అదనంగా నియమించుకుంటున్నాను" అన్నాడు.

ఇతర అర్హతలన్నింటికంటె గూడా నీతినిజాయితీలు ఎక్కువ విలువైనవి.

నైతిక బోధనకు అంశములు

నైతిక బోధనకు సిలబస్ ఏమీ లేదు. సమాజంలో నైతిక విలువలు నిలబెట్టడానికి విద్యాలయాల్లో నైతిక బోధన తప్పనిసరిగా ఉపకరిస్తుంది. దీనికై వారానికి ఒక పీరియడ్ అయినా వినియోగించాలి. ఈ క్రింది అంశములను పాఠ్యప్రణాళికగా ప్రతిపాదిస్తున్నాం.

1. వ్యక్తిత్వ వికాసానికి అవసరమగునవి:

* జీవితాంతం ఆరోగ్యంగా ఉండడానికి ఉపకరించే అలవాట్లు
* ఆటలు, వ్యాయామం, యోగాసనాలు, ప్రాణాయామం
* మత్తుపదార్థాలకు, దుర్వ్యసనాలకు లోనుగాకుండుట

* కాలము యొక్క విలువ; దాని సద్వినియోగము
* సమయపాలన ***(punctuality)*** యొక్క ప్రాముఖ్యము
* క్రమపద్ధతిలో పనులు చేయుట; జీవితంలో క్రమశిక్షణ ***(discipline)*** యొక్క విలువ.
* పరీక్షల్లో ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులగుటకు ఎలా చదవాలి? చదివిన వాటిని గుర్తుంచుకోవటం ఎలా?
* గ్రంథాలయం యొక్క ప్రయోజనం : జీవితంలో నిత్యవిద్యార్థిగా రూపొందడం ఎలా? తెలుసుకున్న ప్రతి విషయాన్ని పుస్తకంలో వ్రాసుకోవాలి.
* ఒంటరితనం కూడదు. స్నేహం యొక్క మాధుర్యం. పదిమందితో కలిసి పనిచేయడంలోని ప్రయోజనం. ఐకమత్యమే జీవన సూత్రం.

వ్యక్తికి సమాజంతో విడదీయరాని సంబంధము

* కుటుంబము ప్రేమకు, త్యాగానికి ఐకమత్యానికి నెలవు. జీవితంలో తల్లి మొదటి గురువు. తల్లిదండ్రులకు విధుయులుగా ఉండాలి. ప్రతి గొప్పవాడూ తల్లిదండ్రుల వల్ల తయారైనవాడే.
* గురుశిష్యుల సంబంధము: గురువును గౌరవించినవారి ఉదాహరణలు.
* సంఘసేవ : సేవా కార్యక్రమాలలో పాల్గొనవలసిన అవసరం. సుగుణాలను అలవరచుకొనే మార్గం. స్వార్థాన్ని మరచిపోయే మార్గం.
* వ్యక్తి శ్రేయస్సు, దేశశ్రేయస్సుకూ సమాజ శ్రేయస్సుకూ లొంగి వుండాలి. సామాజిక దృక్పథం అలవరచుకోవాలి.
* దేశహితము సర్వోన్నత లక్ష్యంగా ఉండాలి. ప్రతి రాష్ట్రంలోని చారిత్రిక ప్రదేశాలు, పుణ్య స్థలాల గురించిన పరిజ్ఞానముండాలి.
* భారతీయ సాంస్కృతిక వారసత్వం గురించిన అవగాహన ఉండాలి. మహాత్ముల, దేశభక్తుల జన్మదినాలు జరపాలి.
* బలముతో గూడిన సౌశీల్యం ఉండాలి. అవసరమైనపుడు బలముపయోగించి దురాక్రమణలను దౌర్జన్యాలను ఎదుర్కోవాలే గాని తలవంచరాదు.
* అస్పృశ్యతను అన్ని విధాలా రూపుమాపాలి.

ఇలాంటి విషయాలను ఉదాహరణలతో, సూక్తులతో, చిన్న చిన్న కథలతో వివరిస్తూ నైతిక బోధనను అత్యంత ప్రయోజనకరంగా నిర్వహిస్తే సముచితంగా వుండ గలదు. నేటి విద్యార్థులే రేపటి పౌరులు! ఉపాధ్యాయ సోదరులారా! దేశభవిష్యత్తు మీ చేతుల్లో వున్నది!

❋ ❋ ❋ ❋



చైతన్య ప్రభంజనం

శ్రీమతి సి.పద్మ

కదిలొచ్చిన అదృష్టం

జ్ఞానాన్ని యథాతథంగా ఒక జ్ఞానే బోధించగలడు. జ్ఞాని వైభవాన్ని అనుభవ పూర్వకంగా ఒక జ్ఞానే ప్రవచించగలడు. జ్ఞాని అద్భుత వైభవాన్ని జ్ఞాని స్వయంగా వివరిస్తూ ఉంటే, ఆ జ్ఞానిని ప్రత్యక్షంగా దర్శిస్తూ ఆలకించే మహద్భాగ్యానికి నోచుకున్నారు మన మోక్షధామం శ్రోతలు. వీరు మామూలు శ్రోతలు కాదు, విద్యార్థులు. క్రమం తప్పకుండా వారం వారం జరిగే మోక్షధామం తరగతులకు హాజరవుతూ నోట్సు వ్రాసుకుంటూ, తిరిగి యూట్యూబులో రెండు రోజుల వ్యవధిలో ప్రసారమయ్యే గురుదేవుల ప్రవచనాన్ని మరల మరల ఆలకిస్తూ శ్రవణ మననాలను కొనసాగిస్తున్న వీరు ఉత్తమ శ్రేణికి చెందిన ఆధ్యాత్మిక విద్యార్థులు. శ్రీ సుందర గురుదేవుల వాత్సల్యానికి నోచుకున్న మేటియైన శిష్యులు.

మండిస్తున్న ఎండలను విస్మరిస్తూ వయో వృద్ధుల నుండి బాలబాలికల వరకు చేతిలో పెన్ను పుస్తకం పట్టుకొని వడివడిగా శ్రుతిమందిరం లోనికి ప్రవేశించడం చూస్తూ ఉంటే సుందర చైతన్య ఆశ్రమం ఎంతటి విశాలమైన వేదాంత విద్యాలయంగా విస్తరించిందో అర్థమవుతుంది. మూడు దశాబ్దాల క్రితం శంకుస్థాపన జరిగిన రోజే ఈ శుభ పరిణామాన్ని గురుదేవులు ఎరుగుదురు. ఇది వారి స్వప్నం. కాదు, సంకల్పం. దృఢ నిశ్చయం. వారు అవతరించిందే తాము తరించేందుకు. ఆ పైన పరులను తరింప చేసేందుకు. అందుకే జ్ఞానం వారి ప్రాణం. శాస్త్రం వారి ఊపిరి. శ్రుతిమందిరమే వారి ఆశాదీపం. ఇదంతా నెరవేరటం గురుదేవుల కృషి అని మనమంటే, గోవిందుని కృప అని వారంటారు. ఏది ఏమైనా గురుగోవిందుల కరుణా ఛత్రం క్రింద తలదాచుకున్న మనం ధన్యులం.

ఆరోగ్య రీత్యా వైద్య బృందం సలహా మేరకు కొంతకాలం ప్రవచనాలను విరమించిన గురుదేవులు అసంపూర్ణంగా మిగిలి ఉన్న భగవద్గీతా ప్రవచనాలను పునః ప్రారంభించ దలచి, మధ్యలో వారధిగా, సింహావలోకనంగా 'తత్త్వబోధ' తరగతులను నిర్వహించి ఇప్పుడు భగవద్గీతను పరిసమాప్తం చేసే కార్యంలో నిమగ్న మయ్యారు.

ప్రస్తుతం భగవద్గీత తృతీయ షట్కం, అంటే చివరి భాగం లోకి వచ్చి ఉన్నాము. ఒక్క ఆదివారం కూడా విరామం లేదు, విశ్రాంతి లేదు. ప్రపంచమంతా ఆదివారం కోసం ఎదురు చూస్తుంది. విశ్రాంతి కోసం. మోక్షధామం విద్యార్థులూ ఆదివారం కోసం ఎదురు చూస్తారు. విశ్రాంతికో వినోదానికో కాదు. విజ్ఞానం కోసం. ఇది గురుదేవులు చేసే చమత్కారం. వ్యక్తిని వేదాంతంతో కట్టిపడేసే నైపుణ్యం. ఫలితం సుస్పష్టం. ఎందరో

లౌకికులు ఇప్పుడు పురుషార్థ నిశ్చయం జరిగి ముముక్షువులుగా, జిజ్ఞాసువులుగా వారిచే మలచబడ్డారు. వాళ్ళు మారిన సంగతి వాళ్ళకే తెలియదు. దారి మళ్ళింది, వాళ్ళు నడుస్తున్నారు. అంతే. అంత సహజంగా జరిగి పోతుంది. నది సాగరం వైపు సాగినట్లు వారి జీవితాలు అడ్డంకులను, అవరోధాలను దాటుకుంటూ మెల్లగా, చల్లగా ఒక సెలయేరులా ముందుకు సాగుతూ ఉన్నాయి. ఒకే ఒక్క దర్శనంతో, సంభాషణంతో గురుదేవులు సాధించే మహత్తరమైన కార్యమిది.

ఒక్కొక్క ఆదివారం ఒక్కొక్క సత్సంగ శాఖ - ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ - ఈ మూడు ప్రాంతాలకు చెందిన వారు ఆశ్రమంలో ఆ నాటి తరగతికి హాజరు కావడం, గురుదేవుల దర్శన, పాద స్పర్శన, సంభాషణ భాగ్యాన్ని పొందడం, గురుదేవుల ఆదేశం పై వారి కోసం ఆశ్రమం తయారు చేసే విందు భోజనాన్ని ఆరగించడం, మధ్యాహ్నం కొంత సేదదీరి మరల తిరుగ ప్రయాణం కావడం ఇటీవల ఒక అలవాటు, కాదు ఆచారంగా మారింది. ఇప్పటి వరకు వరుసగా రాజమండ్రి, మహబూబ్‌నగర్, నిజామాబాద్, గుంటూరు, కర్నూలు, చిత్తూరు, కడప సత్సంగ సభ్యులు ఈ విధంగా లబ్ధి పొంది తృప్తి చెందారు.


కలిసొచ్చిన సౌభాగ్యం

మే 10వ తేది ఆదివారం ఆశ్రమం వచ్చిన భక్తులు విశాఖపట్నం సత్సంగ సభ్యులు. భగవద్గీత పదమూడవ అధ్యాయం క్షేత్ర క్షేత్రజ్ఞ విభాగ యోగాన్ని గురుదేవులు ప్రారంభించారు. ప్రారంభమే ప్రస్థానంగా అధ్యాయానికి ఉపోద్ఘాతం సాగింది. ఆ తరువాత మూడు శ్లోకాలను శంకర భాష్యానుసారం వివరించేందుకు గురుదేవులకు రెండు గంటలకు పైగా పట్టింది. ఒక ప్రవాహ రూపంలో గురుదేవుల జ్ఞాన వాహిని ముందుకు సాగిపోతూ ఉంటే శ్రోతలు శ్రద్ధగా గురుదేవుల భావాలను అనుసరిస్తూ అర్థం చేసుకుంటూ ముఖ్యాంశాలను వ్రాసుకుంటూ ఉన్నారు. విషయం అంత చిక్కగా, సారభూతంగా, దట్టంగా అల్లుకొని ఉండింది.

ప్రవచనం చివరలో ఒక్కొక్క తరగతిలో ఒక్కొక్క క్రొత్త పాటను గురుదేవులు పాడి వినిపించడం జరుగుతూ ఉంది. అదే ప్రక్రియలో గురుదేవులు విశాఖపట్నం సత్సంగ సభ్యుల్ని ఉద్దేశించి పలికిన మాటలు అందరి హృదయాలను కదిలించి వేశాయి. సత్సంగం అంటే ఇలా ఉండాలి అనే భావన వారు పలికిన ప్రతి మాటలో ప్రతిధ్వనించింది.

'విశాఖపట్నం సత్సంగం ప్రేమ గల సత్సంగం. తొలి నుండి క్రమశిక్షణతో సాగే సత్సంగం. అందుకే వాళ్ళంటే నాకు చాలా ఇష్టం. నేను వారి కేంద్రానికి వెళ్ళి చాలా కాల మయింది. ఏం చేయను? ఇక్కడ నాకు ఒక్క క్షణం తీరిక లేదు. అయినా వాళ్ళెప్పుడూ నా మనసులో మెదులుతూనే ఉంటారు. భక్తి జయమే గాని అపజయ మెరుగదు. అందుకే ప్రేమ గల ఈ సత్సంగానికి నేనూ ప్రేమతో ఒక పాట వ్రాశాను' అని పలికి గురుదేవులు వారి కోసం వ్రాసి, స్వరపరచిన కొత్త గేయాన్ని వీనులవిందుగా పాడి వినిపించారు. కరతాళ ధ్వనులు మారుమ్రోగుతుండగా విశాఖ సత్సంగం వారు ఆనంద బాష్పాలు రాల్చారు.

పాట



పల్లవి: ఎరుగదు భక్తి ఓటమి
చేటెరుగదు భక్త కూటమి
ప్రేమే ప్రాణంగా బ్రతికే సత్సంగం ॥ ఎరుగదు ॥

చరణములు:

(1) హృదయాలన్నీ రాగమయం
భావాలన్నీ ప్రేమమయం
సాధనలన్నీ యోగమయం ॥ ఎరుగదు ॥

(2) భక్తుల అనురాగం వీడని అనుబంధం
సభ్యుల ఆత్మీయం చెరగని ఆనందం
గురుగోవిందుల కృపయే అపారం ॥ ఎరుగదు ॥

(3) తప్పటడుగులు తప్పవు ఎక్కడైనా
నడక నేర్పేందుకే శిక్షణ ఎవరికైనా
వీడకుండ పెరిగితే సద్గతే ఎప్పుడైనా ॥ ఎరుగదు ॥

(4) బాధలు తీర్చేది గాయాలు మాన్పేది
స్వాంతన నిచ్చేది శాంతిని పెంచేది
అదే సత్సంగము మోక్ష సోపానము ॥ ఎరుగదు ॥

ప్రవచనం పూర్తయిన వెంటనే డెబ్బై మందికి పైగా అరుదెంచిన సభ్యులు గురుదేవుల దర్శనార్థం పూజ్య స్వామీజీ మందిరం ముందు బారులు తీరి నిలుచున్నారు. చేతులలో ఫలపుష్పాదులతో, కానుకలతో, నూతన వస్త్రాలతో భక్తులు లోనికి ప్రవేశించారు. గురుదేవులు ఒక్కొక్కరినే ప్రేమగా పలుకరిస్తూ, కుశల మడుగుతూ ఆశీర్వదిస్తూ ఉంటే వారి ఆనందానికి అవధులు లేవు. 'జై గిరిధారి! జై జై గిరిధారి!' 'బృందావన విహారీ లాల్‌కీ జై!' 'జై బోలో సుందర చైతన్యానంద గురు భగవాన్ కీ!' 'ఓం నమో భగవతే వాసుదేవాయ!' 'జై శ్రీరాం' అనే జయజయ ధ్వానాలు మందిరంలో మారుమ్రోగుతూ ఉంటే, గురుదేవుల పాదాల నుండి మోకాళ్ళ పర్యంతం కుప్ప పోసిన రంగురంగుల పూలు, పూలమాలలు వారి భక్తి సౌరభంతో గుబాళిస్తూ ఉంటే, తారల నడుమ చంద్రుడిలా భక్తుల మధ్య గురుదేవులు వెన్నెల నవ్వులతో వెలిగిపోతూ ఉంటే ఆ దృశ్యాన్ని తిలకిస్తూ, ఆ శబ్ద తరంగాలకు పులకిస్తూ అటు విశాఖ వారు, ఇటు స్థానిక భక్తులు పరవశించి పోయారు.

బయట దర్శనానంతరం భక్తుల సంబరం ఇంతా అంతా కాదు. 'యూట్యూబ్‌లో చూస్తున్నాం కదా! మోక్షధామం పునః ప్రారంభించిన దశ నుండి గురుదేవుల ఆరోగ్యమే కాదు, వారి తేజస్సు, వర్చస్సు, గళ గాంభీర్యం, గాన మాధుర్యం అన్నీ పునర్వైభవాన్ని సంతరించుకున్నాయి. పాతికేళ్ళ క్రితం నాటి స్వామిని మళ్ళీ చూస్తున్నాం' అని పిన్నలు,

పెద్దలు తమ సంతోషాన్ని వెలిబుచ్చారు. ఆశ్రమం ఇచ్చిన ఆతిథ్యాన్ని స్వీకరించి, కొంతసేపు విశ్రమించి, సాయంత్రం తిరుగ ప్రయాణ మయ్యారు. 'గురుపూర్ణిమకు ఒక రోజు ముందే ఉంటాం' అని వీడుకోలు పలుకుతూ బయలుదేరారు.

పూర్వమే అపూర్వం

17వ తేది ఆదివారం ఆశ్రమానికి వచ్చిన అతిథులు కరీంనగర్ సత్సంగ సభ్యులు. రాష్ట్రమంతటా సుందర సత్సంగాలు వందకు పైగా ఉంటే వాటిలో గురుదేవులు ప్రథమంగా నెలకొలిపిన సత్సంగాలలో కరీంనగర్ సత్సంగం ఒకటి. ఆ తరువాత ఆ నగరంలో గురుదేవులు అనేక యజ్ఞాలు నిర్వహించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలో నేటికి 33 కృష్ణాలయాలు - సత్సంగ భవనాలు నిర్మింపబడ్డాయి. వాటిలో కరీంనగర్‌ది రెండవ స్థానం.

సుమారు 55 మంది సత్సంగ సభ్యులతో ఆ రోజు ఆశ్రమం కళకళ లాడింది. పాత - క్రొత్త సభ్యులు పూర్వ స్మృతులతో, నూతన పరిచయాలతో గురుదేవుల పద సన్నిధిలో పరవశించిపోయారు. ఉపన్యాసానంతరం వేదిక పైన గురుదేవులు కరీంనగర్ సత్సంగం గురించి మాట్లాడుతూ, 'నలభై సంవత్సరాల క్రితం నేను కరీంనగర్‌లో మొట్టమొదట జ్ఞానయజ్ఞం నిర్వహిస్తున్న రోజులవి. బ్రహ్మ ముహూర్తంలో మేల్కోవడం బాల్యం నుంచి నాకు అలవాటు. ఆ సదలవాటును నేటికీ నేను మానలేదు. ఒక రోజు నిద్ర మేల్కోగానే నా మదిలో ఒక పాట మెదిలింది. భావము - రాగము పోటీ పడుతుండగా, సంస్కృత పదాలు అలవోకగా అలా అలా దొర్లుతూ రాగా వెంటనే పాటను వ్రాసి రాగాన్ని జోడించి అక్కడ ఉన్న భక్తులకు పాడి వినిపించాను. అది ఈ రోజు మీ అందరి ముందు వారందరి కోసం పాడుతున్నాను' అని సుందరమైన సుమధురమైన ఈ గీతాన్ని తమ మృదు మధుర గళంతో గురుదేవులు ఆలపించారు. ఇది తొలి రోజులలో వ్రాసిన పాటే అయినా ఆ తరువాత ఒక ప్రవాహ రూపంలో వెలువడిన చైతన్యగాన లహరిలో చేర్చబడలేదు. అందుకే అది పురాతన మైనా అత్యంత నూతనం.

పాట

పల్లవి: సుందరం సుందర శ్యామ సుందరం
ఉర వనమాలం భజ సుందరం ॥ సుందరం ॥

చరణములు:

(1) శుభ పద కమలం తిమిరహారం
వారిజ వదనం విబుధవరం ॥ సుం ॥

(2) కర నవనీతం కరుణాకరం
పరమోదారం దుఃఖహరం ॥ సుం ॥

(3) నయన విశాలం బ్రహ్మాపరం
తత్త్వవిచారం ధరణీధరం ॥ సుం ॥

(4) సుందర చైతన్యం ప్రీతికరం
గీతాచార్యం మధుసూదనం ॥ సుం ॥

నిర్మల భక్తికి రూపం - నిర్మల్ సత్సంగం

ఆ మరుసటి ఆదివారం అంటే 24వ తేది ఆశ్రమానికి వచ్చిన భక్తులు నిర్మల్ సత్సంగీయులు. 150కు పైగా సభ్యులు మోక్షధామం తరగతికి హాజరై గురుదేవుల అనుగ్రహానికి పాత్రులయ్యారు. తెలంగాణా లోనే అతి పెద్ద సత్సంగాలలో ఒకటైన నిర్మల్ సత్సంగం ఉత్తమ శ్రేణికి చెందిన సత్సంగం. ప్రేమకు, అవగాహనకు, స్ఫూర్తికి, మైత్రికి మారుపేరుగా, ఒక నిర్మల సరోవరంలా భాసించే ఈ భక్త బృందం గురుదేవులకు ఎల్లప్పుడూ ఎంతో ఆనందాన్ని కలిగిస్తూ ఉంటుంది.

ఒకటిన్నర దశాబ్దం క్రితమే వీరు ఒక అందమైన కృష్ణాలయాన్ని - సత్సంగ భవనాన్ని వారి నగరంలో నిర్మించుకోగలిగారు. మన ఆశ్రమం లోని ఆలయాన్ని పోలిన మురళీ కృష్ణాలయం, క్రింద గురుమందిరం, ఆ ప్రక్కనే గురుదేవుల కొరకు నిర్మించిన వసతి గృహం - అన్నీ ఆహ్లాదకరమైన ప్రకృతి దృశ్యాల నడుమ ఎంతో శోభాయమానంగా ఉంటాయి.

గురుదేవుల ప్రవచనానంతరం శ్రీ పి.కిషన్ దంపతులు వారి కుటుంబ సమేతంగా పూజ్య గురుదేవులను పట్టు శాలువలతో, పూలమాలలతో, సువర్ణ కంఠాభరణంతో ఘనంగా, సభక్తికంగా సత్కరించుకొని గురుదేవుల ఆశీస్సులను అందుకున్నారు. అంతటితో తృప్తి చెందక, శ్రుతిమందిరం లోని వేలాది మంది భక్తులకు వితరణ చేసేందుకు వారే స్వయంగా లడ్డు ప్రసాదాన్ని తయారు చేయించి, అందమైన పేటికలో ఉంచి ఆశ్రమానికి సమర్పించుకున్నారు. ఉపన్యాసానంతరం నిర్మల్ సత్సంగ్ సభ్యులందరికి మందిరంలో గురుదేవులు ప్రత్యేక దర్శనాన్ని, ప్రసాదాన్ని అనుగ్రహించారు. వేదిక పైన నిర్మల్ సత్సంగాన్ని ఉద్దేశించి గురుదేవులు రచించి, స్వరపరచి, గానం చేసిన అద్భుత గీతాన్ని ఈ క్రింద అందిస్తున్నాము.

పాట

పల్లవి : ఏమిటో ఈ వింత - సృష్టి సౌందర్య మంతా
జగతిని గాంచినంత - ఒళ్ళంతా పులకరింత ॥ ఏమిటో ॥

చరణములు :

(1) సెలయేటి ఉరుకులలో
దుందుడుకు లేమిటో!
అడిగింది చిరుగాలి ఈల వేసి
రాలిన పువ్వులు పరిచాయి దారులు
ఏమిటో ఈ దైవలీల ॥ ఏమిటో ॥

(2) కరిగాయి మబ్బులు
వెలిగాయి దిక్కులు
పంట చేతికొచ్చింది
పండుగ చేసింది
ఆకాశమంతా కొండంత దీపం
నేలతల్లి పచ్చిక చేరే ॥ ఏమిటో ॥

(3) పూచింది పూదోట - పిలిచింది పాలపిట్ట
ఏ దిక్కు చూచినా
అదే కలవరింత
రసరాగ సీమలో - అసమాన కాంతిలో
గుడిగంట మ్రోగింది ॥ ఏమిటో ॥

(4) మేఘమాల ఉరిమింది
మెరుపు తీగ జారింది
స్వాతి చినుకు కురిసింది
జాతి ముత్య మయ్యింది
చిరుగాలిగా వచ్చి కౌగిలించినాది
సుమపరిమళాలను వెదజల్లినాది ॥ ఏమిటో ॥

జై జై గురుదేవ!



ఆత్మ బంధువులారా
ఓం నమో భగవతే వాసుదేవాయ.

స్వీకరించుట - సమర్పించుట...... ఈ రెండిటితోనే మన జీవితం నిండి ఉంటుంది. తల్లి పాలు స్వీకరించి బ్రతుకును ప్రారంభించింది మొదలుకొని, దేహాన్ని శ్మశానానికి అర్పించే వరకు మధ్యలో సాగేవన్నీ ఈ రెండే అయి ఉంటాయి. మొదటిది గ్రహించట మయితే, రెండవది అనుగ్రహించటము. సంగ్రహబుద్ధి జీవ భావము. అనుగ్రహ బుద్ధి దైవ స్వభావము. జీవత్వాన్ని దైవత్వంగా భావించవలసిన మనం సంగ్రహంలో కూడా అనుగ్రహమే ఉండేలాగ, నిండేలాగ ప్రయత్నం కొనసాగించాలి. ప్రవర్తనలో పరివర్తనను దర్శించాలి.

పరుల దుఃఖాన్ని గ్రహించటానికి, అర్హులకు ఉపకారం చేయటానికి బుద్ధి అవగాహనతో సిద్ధపడితే, ఆ క్షణం నుండే సంగ్రహంలో కూడా అనుగ్రహం తొంగి చూస్తూ ఉంటుంది.

ఇతరుల నుండి మనకు అందవలసింది ప్రారబ్ధ ప్రసాదమే కనుక అది అంది తీరుతుంది. మనం అందుకోవలసింది పురుషార్థ ఫలమై ఉంటుంది. దీనిని ప్రయత్నంతో పొందేందుకు నడుం బిగించాలి.

పరుల నుండి గ్రహించేది మనది కాదు. అది పరులకు ఉపకరించేటప్పుడు గ్రహింపవలసిన అవసరమూ లేదు. అది వారి వద్దే ఉండొచ్చు. కాని, దుఃఖాన్ని ఎవరూ ఉంచుకోలేకపోతున్నారు. దానితో కలిసి జీవించలేకపోతున్నారు. ఈ ప్రతిబంధకాన్ని తొలగించి, వారి దుఃఖాన్ని గ్రహింపగలిగితే, పరుల బ్రతుకులు తేలికపడతాయి.

అయితే, పరుల ప్రతిబంధకాలను తొలగించి, ఆ తరువాత వాటిని మన ప్రగతికి అవరోధంగా పేర్చుకోకూడదు. ఇదే జరిగితే, మళ్ళీ పరదుఃఖహర మనే ప్రయత్నంలో ముందుకు పోయేందుకు దారి ఉండదు. పరులకు ఉపకరించని దుఃఖం మనకూ హితం కాదు. పరదుఃఖ హరము సముచిత కార్యము. పరదుఃఖానుభవము అనుచిత కార్యము.

దుఃఖ మనేది ఒక వస్తువు కాదు. కనుక వస్తువును గ్రహించునట్లు, పరుల దుఃఖాన్ని గ్రహించలేము. దుఃఖ మనేది ఆలోచనా విధానము. అదొక ప్రక్రియ. కనుక, అవగాహనతోనే అది తొలగుతుంది. ఈ విధమైన అవగాహనను అందించటంలో, వెలుగులో చీకటి అదృశ్యమైనట్లు, జ్ఞానంలో దుఃఖం దూరమవుతుంది. ఇదే స్వీకరించటం

లేదా గ్రహించటం అంటే. వాస్తవానికి ఇక్కడ జరిగింది కూడా గ్రహించట మనే నేపథ్యంలో సాగిన అనుగ్రహమే.

దుఃఖపడే స్వభావ ముండే వారు దుఃఖపడకుండా ఉండలేరు. సంతలో వస్తువుల్ని ఎలా కొంటారో, ఇతరులతో ఏర్పరచుకొనే సంబంధాలలో దుఃఖాన్ని అలా ప్రోగు చేసుకుంటారు. ఇదంతా దురవగాహన. దుఃఖానికి దారి. అవగాహనతో ఈ దారిని మనం మార్చవచ్చు. అలా ప్రతిసారి మార్పు చేస్తూ పోయేందుకు సదా ఎవరు ఎవరికి తోడుగా ఉంటారు. పడకుండా చూచేందుకు సైకిల్ అభ్యసించే వానికి నేర్పించేవాడు తోడుగా పరుగెత్తవచ్చు. అది కొంత కాలమే జరుగుతుంది. తరువాత త్రొక్కే వాడి కాళ్ళే కదలాలి. పరుగెత్తే వాడి కాళ్ళు నిలిచిపోవాలి. ఇతరుల కన్నీళ్ళు తుడవటం శ్రేయస్కరము. తుడిచేవాడికి రెండే చేతులు. కార్చే వారికి కళ్ళు ఎన్నని? ఎవరి కన్నీటిని వారు తుడుచుకొనేలా చేయగలిగితే, ఆ తరువాత కన్నీళ్ళు కనిపించవు. రోగం వచ్చిన తరువాత నయం చేసుకోవటం ఎంత ప్రధానమో, తిరిగి అది రాకుండా చూసుకోవటం అంత ప్రధానము. ఈ విషయంలో స్వయంకృతమే ముఖ్య భూమికను పోషించాలి.

ఇలా పరుల దుఃఖాన్ని స్వీకరించటం లేదా హరించటం జ్ఞానసంబంధమైన విషయం. జ్ఞానం పరమాత్మ రూపం. పరుల దుఃఖాన్ని పోగొట్టే సమయంలోనే ఈ సత్యాన్ని వారు గ్రహించేలా చూడాలి. ఇది చాలా సునిశితమైన విషయం. మనపై వారు కురిపించే కృతజ్ఞతా వర్షాన్ని మలుపుత్రిప్పి, ఆ ప్రేమ జలంతో పరమాత్మ చరణకమలాలను అర్చించేలా చూడాలి.

ఆ తరువాత దుఃఖమొస్తే, వారు నీ వద్దకు రారు. పరమాత్మ కోవెలకు కదుల్తారు. ప్రార్థిస్తారు. దుఃఖాన్ని దూరం చేయమని అర్థిస్తారు. నీవే శరణ్యమంటూ మొరపెట్టు కొంటారు. ఇంతకీ వారి ప్రార్థనలో ఆసక్తి స్థానం ఎవరిది? ఎవరికి? ఏమిటి?

వారి అనురక్తి లేదా ఆసక్తి లేదా భక్తి - పరమాత్మ మీద ఉందా? దుఃఖము నుండి విడిపడాలనే విషయం మీద ఉందా? పరమాత్మ మీద లేదు. పరమాత్మను వాడుకొనే ప్రయత్నంలో ఉన్నారు. ప్రపంచంలోనే బాధల్ని నివృత్తి చేసుకోవాలని అందరూ తమవంతు ప్రయత్నం లోపం లేకుండా చేస్తారు. అన్ని దారులు మూతపడినపుడు ఆలయం వైపుకు అడుగులు వేస్తారు. ఇదంతా ఆవేదన నుండి బయట పడేందుకు చేస్తారే గాని భగవంతుడు అవసరాలు తీర్చినా, తానుండేది అవసరాలు తీర్చేందుకే కాదని, తానే మనకు ప్రధానంగా అవసరమై యున్నాడని గ్రహించలేరు.

అర్థమయిందా! (1) పరుల దుఃఖమును హరించటం శ్రేష్ఠము. (2) ఇది కేవలం జ్ఞాన సంబంధమైన విషయం కనుక పరమాత్మను గుర్తించేలా చేయటము శ్రేష్ఠతరము. (3) పరమాత్మయే జీవితంలో అవసరమని గుర్తించేలా చూడటము, వాడుకలో సంతసించటం కాకుండా వేడుకలో సంతృప్తి పడేలా అవగాహనను కల్పించటం శ్రేష్ఠతమము.

మొదటి అంశాన్ని (స్వీకారము) ఈ లేఖలో చూశాం. రెండవ అంశాన్ని (సమర్పణము) వచ్చే సంచికలో చూస్తాం.

25-5-2026

ఆశ్రమం

ॐ స్వామి సుందర చైతన్యానంద






సుందర చైతన్యాశ్రమం

హైదరాబాద్ - 500 043


చైతన్య గీతికలు - 2




స్వామి సుందర చైతన్యానంద


సుందర చైతన్యాశ్రమం
హైదరాబాద్ - 500 043












ప్రసాదము
గురుపూర్ణిమ
9-7-2025 నుండి
10-7-2025 వరకు
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్ - 500 043





ఆరంభంలో అరచేయి

శ్లో॥ కరాగ్రే వసతే లక్ష్మీః
కరమూలే సరస్వతీ
కర మధ్యే తు గోవిందః
ప్రభాతే కరదర్శనం ॥

చేతి వ్రేళ్ళ చివర లక్ష్మీదేవి ఉంది. మణికట్టు వద్ద సరస్వతీదేవి ఉంది. అరచేతి మధ్యన గోవిందుడున్నాడు. ప్రభాతవేళ నీ అరచేతిని చూసుకో.


చేతి నుండి పడేది అర్పణం
చేతిలో పడేది ప్రసాదం
ఇదే శాంతి జీవనం.



















ప్రసాదము
9-7-2025
నుండి
10-7-2025
వరకు
సుందర చైతన్యాశ్రమం, హైదరాబాద్ - 500 043

